Follow: @ANNTELUGU
24-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 245 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇన్‌ఫ్లూయెన్సర్లకు నెలకు రూ.15వేలు

- విశ్వసనీయ ఇన్ ఫ్లూయన్సర్లకు సర్కారు బొనాంజా
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీకి
- ఏపీ క్యాబినెట్ ఆమోదం

**అమరావతి, మహా :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీ'కి ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విశ్వసనీయ ఇన్‌ఫ్లూయెన్సర్లను గుర్తించి, వారిని ఎన్‌రోల్ చేసుకోనున్నారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా కేటగిరీలుగా విభజించి పారితోషికం చెల్లిస్తారు. సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ భారీగా నిధులు కేటాయించింది. అమరావతి

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ

- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం

03



### సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం'

ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

03



### ది ప్యారడైజ్ హవా

- థియేటర్లు దద్దరిల్లాల్సిందే
- రికార్డు కలెక్షన్లతో ప్రీమియర్లు

03



### తెలంగాణపై వర్ష బీభత్సం

- నేడు అతిభారీ.. రేపు, ఎల్లుండి అత్యంత భారీ వర్షా లు.
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం సహా పలు జిల్లాలకు హెచ్చరికలు.

02



### రిమ్స్ ను సందర్శించిన కవిత

- ప్రభుత్వం పై విమర్శలు
- ఏదీ సరిగా లేదని ఆగ్రహం
- మృతుల కుంబాలకు 50లక్షల పరిహారానికి డిమాండ్

03



# బీజేపీకి కొత్తరూపు

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లు

తమిళనాడు కో ఇన్ ఛార్జిగా డీకే అరుణ

కర్నాటక కో ఇన్ ఛార్జిగా కాసం వెంకటేశ్వర్లు..

పురందేశ్వరికి ఒడిస్సా బాధ్యతలు

### తెలంగాణ ఇన్ ఛార్జ్ గా సునీల్ బన్సల్ సహ ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మ

**ఢిల్లీ, మహా :** భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సంస్థాగత వ్యవహారాల్లో భారీ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిలను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త బృందాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు డాక్టర్ అరవింద్ భదౌరియా ఇన్‌చార్జిగా, వనతి శ్రీనివాసన్ సహ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. తెలంగాణ బాధ్యతలను సునీల్ బన్సల్ వద్దే కొనసాగిస్తూ ఆయనకు అభయ్ పాటిల్, రేఖా శర్మలను సహ ఇన్‌చార్జిలుగా

మిగతా 2వ పేజీలో

### గణేశ్ నిమజ్జనానికి

# హైదరాబాద్ సిద్ధం

రేపే ఖైరతాబాద్ గణపయ్య నిమజ్జనం

రాత్రంతా 8 ప్రత్యేక ఎంఎంటీఎస్ రైళ్లు



**హైదరాబాద్, మహా :** గణేశ్ నిమజ్జనానికి హైదరాబాద్ నగరం సిద్ధమవుతోంది. భారీ సంఖ్యలో భక్తులు నగరానికి తరలిరానున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు రాత్రి వేళల్లో 8 ప్రత్యేక ఎంఎంటీఎస్ రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నిమజ్జన వేడుకల సమయంలో రోడ్లపై భారీ ట్రాఫిక్ ఆంక్షలు ఉండే అవకాశం నేపథ్యంలో ఎంఎంటీఎస్ రైళ్లు భక్తులకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా సదుపాయంగా ఉపయోగపడనున్నాయి. సికింద్రాబాద్, నాంపల్లి, లింగంపల్లి, ఫలక్‌నుమా మార్గాల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. అన్ని ముఖ్యమైన ఎంఎంటీఎస్ స్టేషన్లలో ఆగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశారు. నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే 69 అడుగుల ఖైరతాబాద్ పంచముఖ సంకటహర మహాగణపతి నిమజ్జనం శుక్రవారం జరగనుంది. ఉదయం సుమారు 6 గంటలకు మహాగణపతి శోభాయాత్ర ప్రారంభించి.. మధ్యాహ్నం 12 గంటల్లోపు హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం పూర్తి చేయాలని ఉత్సవ కమిటీ లక్ష్యంగా పెట్టుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు కల్పించి గురువారం నిమజ్జన ఏర్పాట్ల కోసం

మిగతా 2వ పేజీలో



### సత్యతేజకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సన్మానం

- జోర్డాన్‌లోని కరాటే ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం

02

### ఫలించిన సీఎం రేవంత్

# వ్యూహం

### జూరాల రైతులకు శుభవార్త

నీటి విడుదలకు అంగీకరించిన కర్ణాటక సీఎం

ఫలించిన తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల చర్చలు



**బెంగళూరు, మహా :** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తెలంగాణ ప్రభుత్వ చర్చలు ఫలించాయి. నీటి విడుదలకు కర్ణాటక సీఎం అంగీకరించారు. తెలంగాణకు కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరగా అందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. కొందరు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎంతో బుధవారం ఉదయం భేటీ అయ్యారు. మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో భేటీ సందర్భంగా నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు

మిగతా 2వ పేజీలో




### చర్చలు విఫలం... 5 రోజులు బ్యాంకులు బంద్!

- దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు
- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె
- లావాదేవీలు ముందుగానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన

03



# శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- హుండీ కానుకలు రూ.28.94 కోట్లు, 33 లక్షల లడ్డూల విక్రయం
- సమిష్టి కృషితో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం
- 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం
- మీడియా సమావేశంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

02

### ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద ఘటన

- మరో ఏడుగురు చిన్నారుల పరిస్థితి విషమం
- ఇప్పటికై ఐదుగురు పసికందులు మృతి

03

### ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద బాధిత కుటుంబాలకు

# రూ. 5 లక్షల చొప్పున ఆర్థికసాయం

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వ నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందించనున్నట్లు మంత్రి రాజనర్సింహ ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. రిమ్స్‌లో 150 బెడ్లతో మాతాశిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక వసతులతో ఎంసీహెచ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.





# గణేశ్ నిమజ్జనానికి హైదరాబాద్ సిద్ధం

( మొదటి పేజీ తరువాయి )

మండపం, బ్యారికేడ్ల తొలగింపు తదితర పనులు చేపట్టనున్నారు. ఇక ప్రధాన నిమజ్జన కేంద్రంగా ఉన్న హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జన ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా అదనపు క్రేన్లు, ప్లాట్‌ఫారమ్‌లను సిద్ధం చేస్తున్నారు. గతంలో నిమజ్జన కార్యక్రమం మరుసటి రోజుకూ కొనసాగడంతో ట్యాంక్‌బండ్, పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ పెరిగేది. ఈసారి ప్రక్రియను మరింత వేగంగా పూర్తి చేసేలా రెండు ప్లాట్‌ఫారమ్‌లను ఆధునీకరించినట్లు అధికారులు తెలిపారు.

**ట్రాఫిక్.. పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**

ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు వస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక మార్గదర్శకాలు, వాహనాల మళ్లింపులు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల కోసం ప్రత్యేక నడక మార్గాలను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ కూడా రోడ్ల మరమ్మతులు, బ్యారికేడింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, నిమజ్జన క్రేన్ల వంటి ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఖైరతాబాద్ ప్రాంతంలో నిమజ్జనానికి సంబంధించిన పారిశుద్ధ్య ఏర్పాట్లు సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. నిమజ్జన వేడుకలు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఎంఎంటీఎస్ సర్వీసులు భక్తులు, ఇతర ప్రయాణికులకు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చిన వారు రోడ్డు రద్దీని తప్పించుకుని రైళ్ల ద్వారా తమ ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

# బీజేపీకి కొత్తరూపు



( మొదటి పేజీ తరువాయి )

నియమించారు. దేశవ్యాప్తంగా చేసిన ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పార్టీ ప్రకటించింది. సునీల్ బన్సల్ తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కూడా నిర్వహించనున్నారు. దీంతో తెలంగాణలో ఇప్పటికే కొనసాగుతున్న సంస్థాగత పర్యవేక్షణకు అదనంగా ఇద్దరు సహ ఇన్‌చార్జిలను జోడించినట్లయింది.

**ఏపీకి అరవింద్ భదౌరియా**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ సంస్థాగత వ్యవహారాల బాధ్యతను డాక్టర్ అరవింద్ భదౌరియాకు అప్పగించడం తాజా మార్పుల్లో కీలక అంశంగా నిలిచింది. ఆయనకు సహ ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్ వ్యవహరించనున్నారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, పార్టీ కార్యకలాపాల పర్యవేక్షణ, జాతీయ నాయకత్వం-రాష్ట్ర యంత్రాంగం మధ్య సమన్వయం వంటి బాధ్యతలు ఇన్‌చార్జి వ్యవస్థలో ప్రధానంగా ఉంటాయి.

**డీకే అరుణకు తమిళనాడు బాధ్యతలు**

తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తమిళనాడు ఇన్‌చార్జిగా రామ్ మాధవ్ ఉండగా, డీకే అరుణతో పాటు నిర్మల్ కుమార్ సురాణా సహ ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు. దక్షిణ భారతదేశంలో పార్టీ సంస్థాగత విస్తరణకు సంబంధించి తెలుగు రాష్ట్రాల నాయకులకు బాధ్యతలు అప్పగించిన అంశం తాజా పునర్వ్యవస్థీకరణలో ప్రత్యేకంగా కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు కూడా ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమెకు సహ ఇన్‌చార్జిగా స్వదేశ్ సింగ్‌ను నియమించారు. పురందేశ్వరికి గతంలోనూ ఒడిశా పార్టీ వ్యవహారాల బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది.

**కాసమ్ వెంకటేశ్వర్లుకు కర్ణాటక బాధ్యత**

తెలంగాణకు చెందిన డాక్టర్ కాసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ సహ ఇన్‌చార్జిగా నియమించారు. కర్ణాటక ఇన్‌చార్జిగా హరీశ్ ద్వివేది ఉండగా, కసమ్ వెంకటేశ్వర్లు సహ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. దీంతో దక్షిణ భారతదేశంలోని కీలక రాష్ట్రాల సంస్థాగత వ్యవహారాల్లో తెలుగు రాష్ట్రాల నాయకులకు ప్రాధాన్యమైన బాధ్యతలు లభించాయి. పురందేశ్వరికి ఒడిశా బాధ్యతలు అప్పగించడం ఆమెకు ఆ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాలతో ఉన్న పాత అనుభవాన్ని మరోసారి వినియోగించుకునే అవకాశంగా మారింది. ఆమె గతంలో 2020 నవంబర్ నుంచి 2022 ఆగస్టు వరకు ఒడిశా ఇన్‌చార్జిగా పనిచేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. తాజా నియామకంతో ఆమెకు మరోసారి అదే రాష్ట్ర సంస్థాగత బాధ్యతలు దక్కాయి.

**కేంద్ర కార్యాలయ బాధ్యతల్లోనూ మార్పులు**

బీజేపీ జాతీయ సంస్థాగత వ్యవస్థలో కేంద్ర కార్యాలయ బాధ్యతలకు సంబంధించి కూడా మార్పులు జరిగాయి. ఆగస్టులో ప్రకటించిన జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. తాజా రాష్ట్రాల ఇన్‌చార్జి, సహ ఇన్‌చార్జిల నియామకాలకు సంబంధించిన ప్రకటనను కూడా తరుణ్ చుగ్ పార్టీ కేంద్ర కార్యాలయం తరఫున జారీ చేసినట్లు నివేదికలు వెల్లడించాయి.

**ఏడు రాష్ట్రాలపై ప్రత్యేక కసరత్తు**

2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఏడు రాష్ట్రాల సంస్థాగత బృందాల్లోనూ తాజా పునర్వ్యవస్థీకరణలో మార్పులు చేశారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జి బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలతో పాటు సంస్థాగత నిర్మాణాన్ని ముందుగానే పటిష్ఠం చేసుకునే దిశగా ఈ నియామకాలు జరిగాయని వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.

### బాధ్యతలు ఇలా

**తెలంగాణ:** సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

**ఆంధ్రప్రదేశ్:** అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కోఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

**ఒడిశా:** దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

**కర్ణాటక:** హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

**ఉత్తర ప్రదేశ్:** దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహఇంచార్జ్‌లను కేటాయించారు.

**మహారాష్ట్ర:** బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహఇంచార్జ్‌లుగా నియమించారు.

**ఛత్తీస్‌గఢ్ హర్యానా:** మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**ఢిల్లీ:** డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కోఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**హిమాచల్ ప్రదేశ్:** శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

**మధ్యప్రదేశ్:** మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# ఫలించిన సీఎం రేవంత్ వ్యూహం

( మొదటి పేజీ తరువాయి )



ఎదుర్కొంటున్న పరిస్థితి, వారి కష్టాలను డీకేకు వివరించారు. జూరాల ప్రాజెక్టుతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల కింద 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని, ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని పంటలు కీలక దశలో ఉన్నాయని.. నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోయి దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని శివకుమార్ కు తెలంగాణ ప్రతినిధుల బృందం వివరించింది. ఉమ్మడి పాలమూరు రైతులు నీళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, పంటలు ఎండిపోతే వారి ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడుతుందన్నారు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి సీఎం శివకుమార్ అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 5 వేల క్యూసెక్కుల వరకు కృష్ణా జలాలు విడుదల చేయాలని తెలంగాణ నేతలు కోరినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం డీకే శివకుమార్.. రైతులను ఆదుకునేందుకు నీటి విడుదలకు నిర్ణయం తీసుకుని అధికారులను ఆదేశించారు. రైతుల ఆదుకునేందుకు కృష్ణా జలాల విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడంతో పాలమూరు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఉమ్మడి పాలమూరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తే గతవారం వారే స్వయంగా వెళ్లి రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేసుకున్నారు. అధికారులు పోలీసుల సహాయంతో గేట్లు క్లోజ్ చేసి నీటి విడుదలను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నేతలు జూరాల ప్రాజెక్టు నీటి విడుదల కోసం వారం రోజుల నుంచి ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి, నీటి విడుదలకు డీకే శివకుమార్ ను ఒప్పించడంలో సక్సెస్ అయింది.

# ఇన్‌ఫ్లూయెన్సర్లకు నెలకు రూ.15వేలు

( మొదటి పేజీ తరువాయి )



రాజధాని పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం లభించింది. రాజధాని మౌలిక సదుపాయాల కోసం అదనంగా రూ.644.98 కోట్లు కేటాయించారు. ప్రతిష్ఠాత్మక శాసనసభ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ నిర్మాణ పనుల కోసం రూ.661 కోట్లకు ఆమోదం తెలిపారు. భూసమీకరణ కింద భూములిచ్చిన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలలో సవరణలు చేశారు. రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలను తీర్చే హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు పురోగతిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ II మిగిలిన పనుల కోసం రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, 2027 నాటికి పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. రాయచోటి నియోజకవర్గం హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ 490 535 కిలోమీటర్ల మధ్య రూ.350 కోట్ల విలువైన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు చంద్రబాబు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను హంద్రీనీవాతో అనుసంధానించి, మార్గమధ్యంలోని దాదాపు 25 వేల ఎకరాలకు పైగా ఉన్న ఖాళీ చెరువులను నీటితో నింపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో పాటు, మచిలీపట్నం గోవా షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు.

**కేటగిరీల వారీగా విభజన**

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విశ్వసనీయ ఇన్‌ఫ్లూయెన్సర్లను గుర్తించి, వారిని ఎన్‌రోల్ చేసుకోనున్నారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా కేటగిరీలుగా విభజించి పారితోషికం చెల్లిస్తారు.

1,00,000 పైగా ఫాలోవర్లు: గరిష్ఠం గా రూ. 15,000

50,000 నుంచి 99,999 ఫాలోవర్లు: గరిష్ఠంగా రూ. 7,500

25,000 నుంచి 49,999 ఫాలోవర్లు: గరిష్ఠంగా రూ. 5,000

10,000 నుంచి 24,999 ఫాలోవర్లు: గరిష్ఠంగా రూ. 2,500

**మచిలీపట్నంలో 'గోవా షిప్ బిల్డింగ్ యూనిట్'**

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో గోవా షిప్ బిల్డింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ యూనిట్ ఏర్పాటుకు యాజమాన్యం తక్షణమే సిద్ధంగా ఉండటంతో, కృష్ణా జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని కేబినెట్ ధీమా వ్యక్తం చేసింది. షిప్‌యార్డు ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి లోకేష్‌కు మంత్రివర్గం ధన్యవాదాలు తెలిపింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

వార్డు సచివాలయ ఉద్యోగులకు ఊరట: స్వర్ణ వార్డు సచివాలయంలోని ఎంట్రీ లెవెల్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రత్యేక సర్వీసు రూల్ జారీకి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ప్రభుత్వం ఎలాంటి జాబ్ చార్ట్ లేకుండా ఆలోచనారహితంగా రిక్రూట్ చేసిందని విమర్శించారు.

వర్షపాతం, వ్యవసాయం: సెప్టెంబర్‌లో పడిన వర్షాలు 3 శాతం అధికంగా ఉన్నప్పటికీ, మొత్తం సీజన్ వారీగా చూస్తే సాధారణ వర్షపాతం కన్నా 46 శాతం లోటు ఉందని చర్చించారు. వర్షాలు పడుతున్న తరుణంలో రైతులు వెంటనే విత్తనాలు వేసుకునేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

అల్పపీడన హెచ్చరికలు: తీవ్ర వర్షాలు పడే అవకాశం ఉన్న 7 జిల్లాలలో ప్రజలు ఇబ్బంది పడకుండా మంత్రులు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ధరల నివారణ: ద్రవ్యోల్బణం పెరుగుతుండటంపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ వెంటనే కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని కేబినెట్ ఆదేశించింది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు



తిరుమల, మహా : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అర్చక స్వాములు, అధికారులు, ఉద్యోగులు, జిల్లా, పోలీసు యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు, భక్తుల సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించామని టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు తెలిపారు. బుధవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి చైర్మన్ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముఖ్యాంశాలను వివరించారు. సెప్టెంబరు 15 నుంచి 22వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులకు వాహనసేవలతో పాటు శ్రీవారి మూలమూర్తి దర్శనం కల్పించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజైన సెప్టెంబరు 15న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, ఈ సందర్భంగా 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారని తెలిపారు. ఎనిమిది రోజుల బ్రహ్మోత్సవాల్లో మొత్తం 5.76 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, రూ.28.94 కోట్ల హుండీ కానుకలు లభించాయన్నారు. 21.84 లక్షల అన్నప్రసాదాలు పంపిణీ చేయగా, 2.04 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారని తెలిపారు. 33 లక్షల లడ్డూలు విక్రయించడం జరిగిందన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ద్వారా తిరుపతి నుంచి తిరుమలకు 13,671 ట్రిప్పుల్లో 3,92,106 మంది, తిరుమల నుంచి తిరుపతికి 13,584 ట్రిప్పుల్లో 4,97,195 మంది భక్తులు ప్రయాణించారని, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడసేవ రోజున తిరుమలకు విచ్చేసిన భక్తులందరికీ దర్శనం కల్పించామని చైర్మన్ తెలిపారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో పునరుద్ధరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో హీలింగ్ అండ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, దుర్లభ్ దర్శన్ వీఆర్ అనుభవం, ఎలక్ట్రిక్ బస్సులు, నందకం యాప్, భక్తుల కోసం గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రారంభించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. అలాగే మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రూ. 90 కోట్లతో తిరుచానూరు ఆలయానికి ఉన్న రోడ్లను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలిపిరి సమీపంలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం 50 ఎకరాల్లో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు వృక్ష గోవిందం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు.

శ్రీవారి సేవ, శ్రీవారి వైద్యసేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ ఉద్యోగుల హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వాహనసేవలకు ముందు ఇప్పటివరకు లేనివిధంగా 20 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి 295 కళాబృందాలకు చెందిన సుమారు 7,871 మంది కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారని పేర్కొన్నారు. గరుడసేవ రోజున 14 రాష్ట్రాల నుంచి 32 కళాబృందాలకు చెందిన 916 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా విదేశీ కళాబృందాల ప్రదర్శనలు నిర్వహించగా, జర్మనీ, సింగపూర్ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో సుమారు 60 టన్నుల పుష్పాలు, 4 లక్షల కట్ ఫ్లవర్స్, 80 వేల సీజనల్ ఫ్లవర్స్ వినియోగించి పుష్పాలంకరణ చేపట్టామన్నారు. తిరుమలలో చేపట్టిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని, వాహనసేవలను భక్తులు సులభంగా వీక్షించేలా 36 భారీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

బ్రహ్మోత్సవాల్లో లక్షలాది మంది భక్తులకు సేవలందించేందుకు 4 వేల మంది శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారని ప్రశంసించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం 50 మంది వైద్యులు, 150 మంది పారామెడికల్ సిబ్బంది, 16 అంబులెన్సులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 3,000 మంది పోలీసులు, 2,400 మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారని, గరుడసేవ రోజున అదనంగా మరో 1,000 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారన్నారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పార్కింగ్ ఏర్పాట్లు చేశామని, గరుడసేవ రోజున తిరుమలలో 3,500 మంది పారిశుద్ధ్య సిబ్బంది విశేష సేవలు అందించారన్నారు.

# తెలంగాణపై వర్ష బీభత్సం

**హైదరాబాద్, మహా.** బంగాళాఖాతంలో ఏర్పడిన గాఢ వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఇవాళ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సెప్టెంబర్ 24, 25 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అధికారిక హెచ్చరికల్లో తెలంగాణకు సెప్టెంబర్ 23న అతిభారీ వర్షం, 24-25 తేదీల్లో అత్యంత భారీ వర్షం, 26న భారీ వర్షం అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

బంగాళాఖాతం నుంచి తెలంగాణ వైపు ప్రభావం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న గాఢ వాయుగుండం పశ్చిమవాయువ్య దిశగా కదులుతోంది. ఐఎండీ ప్రకారం సెప్టెంబర్ 23 ఉదయం ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా సుమారు 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య, కళింగపట్నం సమీపంలో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాన్ని సెప్టెంబర్ 23 రాత్రికి దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ వ్యవస్థ ప్రభావం తెలంగాణపై వర్షాల రూపంలో కొనసాగనుంది.

**ఉమ్మడి వరంగల్, ఖమ్మంపై భారీ ప్రభావం**

ఇవాళ ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం ప్రాంతాలతో పాటు పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ప్రాంతాలకు ఆరెంజ్ స్థాయి హెచ్చరికలు జారీ చేసినట్లు మీరు అందించిన తాజా వివరాల్లో పేర్కొన్నారు. ఆకస్మికంగా వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువుల పరిసరాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

**ఉత్తర తెలంగాణపై ప్రత్యేక దృష్టి**

ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు భారీ వర్షాల సూచన ఉంది. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు వెలువడ్డాయి. ఆయా ప్రాంతాల్లో పసుపు స్థాయి హెచ్చరికలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో జల్లులు

కామారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నగర ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది.

**రేపు అత్యంత భారీ వర్షా ల ముప్పు**

సెప్టెంబర్ 24న తెలంగాణలో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. రాష్ట్రానికి సంబంధించిన అధికారిక హెచ్చరికల్లో ఆ రోజు అత్యంత భారీ వర్షాల సూచన నమోదైంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాతావరణ పరిస్థితులు కూడా కొనసాగవచ్చని పేర్కొంది.

**ఎల్లుండి ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్**

సెప్టెంబర్ 25న ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు మీరు అందించిన వివరాల్లో పేర్కొన్నారు. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతిభారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఐఎండీ అధికారిక రాష్ట్ర హెచ్చరిక కూడా సెప్టెంబర్ 25న తెలంగాణలో అత్యంత భారీ వర్షాల అవకాశాన్ని నిర్ధారిస్తోంది.

దక్షిణ జిల్లాల్లోనూ వర్ష సూచన

సెప్టెంబర్ 25న కామారెడ్డి, సిద్దిపేట, జనగామ, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు పేర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లోనూ వర్ష పరిస్థితులను ప్రజలు గమనిస్తూ ఉండాల్సిన అవసరం ఉంది.

**26న ఉత్తర తెలంగాణపై ప్రభావం**

సెప్టెంబర్ 26న ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాణలో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని మీరు అందించిన సమాచారంలో పేర్కొన్నారు. ఐఎండీ రాష్ట్రస్థాయి హెచ్చరికలో కూడా సెప్టెంబర్ 26న తెలంగాణకు భారీ వర్షాల అవకాశం చూపించింది.

**ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో జాగ్రత్త**

వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు కూడా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, బహిరంగ ప్రదేశాలు, నీటి వనరుల సమీపంలో ఉండటం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వర్ష సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా ఉండటం మంచిది.

# సత్యతేజకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సన్మానం

**జోర్డాన్‌లోని కరాటే ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం**



**హైదరాబాద్, మహా :** జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో నిర్వహించిన ఏకేఎఫ్ 24వ జూనియర్ అండర్ 21 ఛాంపియన్‌షిప్-2026లో తెలంగాణకు చెందిన కరాటే క్రీడాకారిణి బ్రహ్మాదండి సత్యతేజ అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. **66 కేజీల విభాగం వ్యక్తిగత కుమిటే లో సత్యతేజ ఈ ఘనత సాధించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించి పతకం సాధించిన సత్యతేజను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షులు, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. తెలంగాణలో క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. "తెలంగాణలో కరాటే క్రీడ వేగంగా దూసుకెళ్తుందనడానికి సత్యతేజ సాధించిన అంతర్జాతీయ పతకమే నిదర్శనం" అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సత్యతేజ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి తెలంగాణతో పాటు దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏకేఎఫ్ 24వ జూనియర్ అండర్ 21 ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ నుంచి పతకం సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా సత్యతేజ రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆమె కనబరిచిన ప్రతిభ తెలంగాణ కరాటే రంగానికి గర్వకారణంగా నిలిచింది. సత్యతేజ సాధించిన విజయంపై ఆమె వ్యక్తిగత కోచ్, ఇండియా కోచ్ కీర్తన్ కొండూరు, స్టేట్ జనరల్ సెక్రటరీ రామస్వామి, ఆమె తల్లిదండ్రులు బ్రహ్మాదండి రమేష్, స్వర్ణలత తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.



# వినాయక లడ్డూకు రూ.74 వేల ధర

## ప్రజా భవన్‌లో రూ.22 వేలు.. నుస్తూలాపూర్‌లో

## రూ.52 వేలకు ప్రసాదం దక్కించుకున్న తుమ్మనపల్లి శ్రీనివాసరావు

**తిమ్మాపూర్ మహా:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ ప్రసాదాల వేలంపాటలో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రసాదాలను దక్కించుకున్నారు. ఎల్ఎండి కాలనీలోని మానకొండూర్ నియోజకవర్గ ప్రజా భవన్ కార్యక్రమంలో నిర్వహించిన వినాయక లడ్డూ ప్రసాదం వేలంలో ఆయన రూ.22 వేలతో లడ్డూను అందుకున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం చేతుల మీదుగా లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అదేవిధంగా తిమ్మాపూర్ మండలం నుస్తూలాపూర్ గ్రామంలోని శ్రీ భవాని సహిత శంకర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన వినాయక లడ్డూ ప్రసాదాల వేలంపాటలోనూ శ్రీనివాసరావు పాల్గొన్నారు. రూ.52 వేల వేలం



పాటతో లడ్డూ ప్రసాదాన్ని ఆయన దక్కించుకున్నారు. ఆలయ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుమ్మనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నుస్తూలాపూర్ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. నుస్తూలాపూర్ రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆకాంక్షించారు.



# గణనాథులకు ఘన వీడ్కోలు

**కరీంనగర్, మహా:** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కరీంనగర్ నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, వివిధ మండలాలు, గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై శోభాయాత్రగా తరలించారు. డప్పుచప్పుళ్లు, భక్తిగీతాలు, గణపతి నామస్మరణతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.కరీంనగర్ నగర పరిధిలో ఏర్పాటు చేసిన సుమారు నాలుగు వేల వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఉదయం నుంచే ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకోగా, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రల్లో పాల్గొన్నారు. మానకొండూరు చెరువు వైపు అత్యధిక సంఖ్యలో విగ్రహాలు తరలివెళ్లాయి. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు క్రేన్లు, లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా కరీంనగర్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పోలీసులను మోహరించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, వైద్య, రెవెన్యూ, పారిశుద్ధ్య శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.



# వినాయక నిమజ్జనానికి రూ.2 కోట్లు

**వరంగల్, కార్పొరేషన్ మహా**: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బల్దియా పరిధిలోని 17 చెరువుల్లో 30 క్రేన్లను ఏర్పాటు చేసి రూ.2 కోట్లతో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు చేపట్టినట్లు జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బుధవారం చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, బల్దియా అధికారులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మత్స్య, మైనింగ్ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం వరకు సుమారు 8 వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందన్నారు. చెరువుల వద్ద తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అత్యవసర సేవలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వాతావరణ శాఖ భారీ వర్షాల సూచన నేపథ్యంలో భక్తులు వీలైనంత త్వరగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలని, అధికారులు, పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. నగర వ్యాప్తంగా 145 మంది గజ ఈతగాళ్లు, డీఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జనం అనంతరం చెరువుల్లో మిగిలే విగ్రహాల అవశేషాలను తొలగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. చెరువుల పరిశుభ్రతకు చర్యలు చేపడతామన్నారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చర్చలు విఫలం... 5 రోజులు బ్యాంకులు బంద్!

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పని దినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన





చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద ఘటన

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ప్రమాద ఘటనలో బాధితులైన చిన్నారుల ఆరోగ్యం మరింత ఆందోళనకరంగా మారుతోంది. ప్రాథమిక చికిత్స పొందుతున్న వారిలో తాజాగా మరో ఏడుగురు చిన్నారుల పరిస్థితి విషమించడంతో వైద్య వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. ఈ పరిణామంతో అప్రమత్తమైన వైద్యులు, అధికారులు అప్రమత్తం అయ్యారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులలో ఏడుగురి ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక వైద్యులు వెంటనే స్పందించారు. మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో వారిని హుటాహుటిన నాలుగు ప్రత్యేక వాహనాలలో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగనుంది. మరోవైపు, ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో ప్రస్తుతం మరో 15 మంది చిన్నారులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా నిపుణులైన వైద్యుల బృందం సేవనందిస్తోంది. ప్రమాద ఘటనకు సంబంధించి బాధితులకు ప్రభుత్వం ఇప్పటికే అండగా నిలుస్తామని భరోసా ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా, పరిణామాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు ముమ్మరం చేశారు. కాగా, ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మొత్తం ఐదుగురు పసికందులు మృతిచెందారు.





# మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్!

**ప్రజానేతకు వినతుల వెల్లువ**

**తాడేపల్లి, మహా :** ప్రజల సమస్యలపై తక్షణం స్పందించే మనసున్న నేత రాంప్రసాద్ రెడ్డికి రాజధాని తాడేపల్లిలోనూ సందర్శకుల తాకిడి అధికంగా ఉంది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను, వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి, ప్రజలకు సత్వర పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంత్రి స్పందన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# రిమ్స్ ను సందర్శించిన కవిత

**ఆదిలాబాద్ మహా:** రిమ్స్ ప్రమాదంలో శిశువుల మరణాలు భగవంతుడి తప్పిదం, ప్రకృతి కోపం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బుధవారం ఆమె పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యేలు బాపూరావు ,బోడ జనార్దన్‌లతో కలిసి రిమ్స్ ను సందర్శించారు. గతంలోనూ ఇదే ఆసుపత్రిలో వందలాది మంది చిన్నారులు మృతిచెందారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆసుపత్రుల్లో సిబ్బంది, సౌకర్యాలపై దృష్టి సారించాలని కోరారు. రిమ్స్‌లో అధికారులు సిబ్బంది, నిర్వహణ లోపాల కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని ఆసుపత్రిలో సరిపడా డాక్టర్లు, నర్సులు లేరని, ఏసీ మెకానిక్ కూడా అందుబాటులో లేరని అన్నారు. నిర్వహణకు అవసరమైన బడ్జెట్ ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రమాదంలో మృతిచెందిన శిశువుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున



నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ తరపున కమిటీ ఏర్పాటు చేసి, ఆసుపత్రిలోని ఆరోగ్య సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు

# మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ

**ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం**

**ముంబై, మహా :** భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది.

ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్.



మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

# ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం.. ఆయుర్వేద వైద్యం

**హనుమకొండ, మహా ;** ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం భారతీయ ఆయుర్వేద వైద్య విధానం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్ 1లోని ప్రగతి మిత్ర కమ్యూనిటీ హాల్‌లో ఆయుర్వేద మెగా శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై ఆయుర్వేద మెగా క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. భారతీయ ఆయుర్వేద వైద్య విధానంలో అనేక వైద్య విధానాలు ప్రజల విశ్వాసాన్ని పొంది ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కరోనా విపత్కర పరిస్థితులలో ఆయుర్వేదం యొక్క గొప్పదనం, విశిష్టత, మానవాళిని రక్షించడంలో ఆయుర్వేదం అందించిన సేవల గురించి వివరించారు. ఆయుర్వేద మెడికల్ క్యాంపులో సుమారు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే యోగా ద్వారా రోగాలను ఎలా నియంత్రించుకోవాలో యోగా



ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్ విభాగం ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ప్రమీలా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా ఆయుష్ ఇన్చార్జి డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ పి. వీరారెడ్డి, కాలనీ అధ్యక్షులు రామ్ రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ అల్లం సర్వేశం, డాక్టర్ మాధవి, డాక్టర్ కుమార్, డాక్టర్ కోక్య, ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు, యోగా ప్రచారకులు, ఎస్ఎన్ఓలు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు ప్రభు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణపయ్యలు

**వరంగల్, హనుమకొండ మహా;** గ్రేటర్ వరంగల్‌లో గణేష్ నిమజ్జనం అంటే మామూలుగా ఉండదు.. ఓవైపు ఆకాశం నుంచి జోరుగా వర్షం దంచికొడుతున్నా, నేల మీద భక్తుల ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. గంగమ్మ ఒడికి గణపయ్యలు చేరుతున్న వేళ నగరమంతా జై బోలో గణేష్ మహారాజ్ కీ..జై అనే నినాదాలతో నగరం అంతా మారుమోగిపోయింది. భారీ వర్షంలో తడుస్తూ వివిధ వాహనాల్లో వెళ్తున్న గణపతి విగ్రహాలు వాటి ముందర డీజే లు, సౌండ్ సిస్టమ్ తో యువత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డ్యాన్స్ లతో అదరగొట్టారు.వర్షం వర్సెస్ గణేష్ నిమజ్జనం వరంగల్, హనుమకొండ జంట నగరాల్లో వినాయక నిమజ్జనం జోరుగా సాగుతోంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అయినా, భక్తుల దూకుడి ముందు వర్షం కూడా తలవంచింది. చిన్నా పెద్దా తేడా లేకుండా బొజ్జ గణపయ్యలను భుజాన ఎత్తుకుని చెరువుల వైపు కదిలారు. ప్రధానంగా వడ్డేపల్లి చెరువు, పరికికుంట, కడిపికొండ ఔటర్ రింగ్ రోడ్ సమీపం, హసన్‌పర్తి చెరువు, భీమారం చెరువు, గోపాల్‌పూర్ అరెకసాయికుంట,గుండ్ల సింగారం కాకతీయ యూనివర్సిటీ చెరువు, వరంగల్ ఉర్సు చెరువు , చిన్న వడ్డేపల్లి చెరువు, సాకరాశి కుంట, రంగసాయిపేట, మామునూరు, చెరువుల వద్ద నిమజ్జనాలు కొనసాగాయి. ర్షాన్ని సైతం లెక్క చేయని



నిర్వాహకులు డీజే సౌండ్లతో, డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. యువత తడిసి ముద్దయినా లెక్క చేయకుండా గణపయ్య ముందు స్టెప్పులేశారు. మహిళలు, చిన్నారులు సైతం నిమజ్జనంలో పాల్గొని గణనాథుడికి కన్నీటి వీడ్కోలు పలికారు.భారీ వర్షాల కారణంగా పోలీస్ శాఖ, బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. క్రేన్ల సహాయంతో పెద్ద గణపతి విగ్రహాలను గంగమ్మ ఒడిలోకి సాగనంపుతున్నారు. వర్షం కారణంగా కరెంటు స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలను పోలీసులు మైక్ ల ద్వారా హెచ్చరించారు. మొత్తానికి.. వరుణుడు అడ్డుపడినా, వరంగల్ గణేష్ నిమజ్జనం మాత్రం ఉత్సాహంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా కొనసాగుతోంది.

# సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం'

ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

మహా : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. ''ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు'' అని అందులో పేర్కొన్నారు.

ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి.

# ది ప్యారడైజ్' హవా

**థియేటర్లు దద్దరిల్లాల్సిందే**

**రికార్డు కలెక్షన్లతో ప్రీమియర్లు**

**మహా :** ది ప్యారడైజ్'.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా ఈ సినిమా గురించే చర్చ జరుగుతోంది. ప్రీమియర్లతోనే రికార్డుల దుమ్ము దులిపేసింది. ప్రీమియర్లు, అడ్వాన్స్ బుకింగ్స్ కలిపి ఏకంగా రూ.50 కోట్లు కలెక్ట్ కావడం రికార్డు. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న ఈ సినిమా పై భారీ అంచనాలే ఉన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం విడుదలైన పాటలు, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి స్పందన రావడంతో పాటు సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా ప్రిమియర్స్ రికార్డుస్థాయిలో కలెక్ట్ చేయగా, అడ్వాన్స్ బుకింగ్స్ లో ఎంతోమంది పెద్ద హీరోల రికార్డులు ఉఫ్ మని ఎగిరిపోయాయి. నాని కెరీర్ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ , అనిరుధ్ బీజీఎం అదరగొట్టేసినట్లు తెలుస్తోంది. యాక్షన్ మాత్రమే కాదు ఎమోషనల్ సన్నివేశాలు కూడా బాగానే ఉన్నాయి. సినిమా పూర్తయిన తర్వాత బరువైన హృదయంతో బయటకు వస్తారని టాక్.



# డిజిటల్ మహావిప్లవంతో పేదలకు మేలు



ఒకప్పుడు డబ్బు పంపడం అంటే సమయం, శ్రమ, నిరీక్షణలతో కూడిన ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. గంటల తరబడి క్యూ లైన్లలో నిల్చొని, భారీగా కమీషన్లు చెల్లించే దుస్థితి నుంచి.. క్షణాల వ్యవధిలో నిధులను బదిలీ చేసే అద్భుతమైన సాంకేతిక స్థాయికి నేడు భారతదేశం చేరుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దార్శనిక విధానాలతో, కాగితాలకే పరిమితమైన భౌతిక ఆర్థిక వ్యవస్థ కాస్తా సామాన్యుడి చేతిలోని స్మార్ట్‌ఫోన్‌లోకి ఒదిగిపోయి దేశంలో సరికొత్త డిజిటల్ విప్లవానికి నాంది పలికింది.

గతంలో డబ్బు పంపే వ్యక్తి ముందుగా నగదు పట్టుకుని పోస్టాఫీసు లేదా బ్యాంకుకు వెళ్లి ఫారాలు నింపి, రుసుము చెల్లించి రోజుల తరబడి ఎదురుచూడటం నిత్యకృత్యంగా ఉండేది. 201112 నాటి అధికారిక గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 1,54,822 పోస్టాఫీసులు ఉండగా, అందులో 1,39,086 కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే సేవలందించేవి. ఆ ఒక్క ఏడాదిలోనే 6.99 కోట్ల మనీ ఆర్డర్లు, టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్ల ద్వారా రూ.10,201 కోట్లకు పైగా లావాదేవీలు జరిగితే, వాటిపై తపాలా శాఖకు ఏకంగా రూ.482 కోట్ల కమీషన్ వసూలైంది. ఆ రోజుల్లో ప్రతి రూ.20కి రూ.1 చొప్పున అంటే ఐదు శాతం రుసుము వసూలు చేసేవారు. వెయ్యి రూపాయలు పంపితే 50 రూపాయలు కమీషన్‌కే పోయేది. బ్యాంకుల కౌంటర్ల వద్ద బారులు తీరడం, ప్రయాణ ఖర్చులు, వృథా అయ్యే సమయం సామాన్యుడికి గుదిబండగా మారిన ఆ పాత భౌతిక వ్యవస్థకు నేడు శాశ్వత పరిష్కారం లభించింది. ఆనాటి మందకొడి వ్యవస్థతో పోలిస్తే నేటి భారతదేశంలో నగదు కదిలే విధానం ఒక చారిత్రక మలుపు తిరిగింది. 2016 ఏప్రిల్ 11న జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) కేవలం 21 బ్యాంకులతో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఏకీకృత చెల్లింపు వ్యవస్థ (యూపీఐ), అదే ఏడాది ఆగస్టు నాటికి మొబైల్ అనువర్తనాల ద్వారా ప్రజల ముంగిటకు వచ్చింది. రిజర్వు బ్యాంకు, బ్యాంకింగ్ రంగం, సాంకేతిక సంస్థల సమిష్టి కృషితో రూపుదిద్దుకున్న ఈ వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వ దార్శనిక నిర్ణయాలు, ప్రోత్సాహకాలు తోడవడంతో ఇది ఒక సామూహిక ఉద్యమంగా మారింది. ఫలితంగా 201617లో కేవలం 1.78 కోట్లుగా ఉన్న వార్షిక యూపీఐ లావాదేవీలు, 202526 నాటికి అక్షరాలా 24,162 కోట్లకు చేరుకుంటాయని అంచనా వేయడం ఈ పరివర్తన వేగానికి ప్రతీక. డబ్బు పంపాలంటే ఎక్కడికి వెళ్లాలనే పాత ప్రశ్న స్థానంలో, ఎవరికి పంపాలనే సరికొత్త సౌలభ్యాన్ని మోదీ సర్కార్ సాకారం చేసింది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఫలాలు కేవలం పట్టణాలకే పరిమితం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో 2022లో కేంద్ర ప్రభుత్వం ఫీచర్ ఫోన్ల వినియోగదారుల కోసం సైతం ప్రత్యేక యూపీఐ సేవలతో పాటు, 24 గంటల సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వ్యవస్థపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి ఎన్‌పీసీఐ తాజా గణాంకాలే సజీవ సాక్ష్యం. 2026 జూలైలో 2,366 కోట్ల లావాదేవీల ద్వారా రూ.29.88 లక్షల కోట్లు బదిలీ కాగా, 2026 ఆగస్టు నెలలో రికార్డు స్థాయిలో 752 బ్యాంకుల అనుసంధానంతో 24,508.96 మిలియన్ల (2,450.9 కోట్ల) లావాదేవీలు జరిగాయి. వీటి ద్రవ్య విలువ ఏకంగా రూ.29,82,355.95 కోట్లుగా నమోదై ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. 20212025 మధ్య కాలంలో డిజిటల్ లావాదేవీలు 11 రెట్లు పెరగ్గా, అందులో యూపీఐ వాటా 80 శాతానికి చేరడమే కాకుండా, 2026 ఆగస్టు నాటి నివేదిక ప్రకారం ఏకంగా 11 దేశాలకు ఈ సేవలు విస్తరించడం నవ భారత సాంకేతిక సత్తాకు నిదర్శనం.

**చిరు వ్యాపారుల దైనందిన జీవితాల్లో వెలుగులు**

ఈ అద్భుతమైన మహావిప్లవం సామాన్యులతో పాటు చిన్న వ్యాపారుల జీవితాల్లోనూ ఊహించని గుణాత్మక పరివర్తనను తీసుకువచ్చింది. గతంలో వ్యాపారులు నగదు నిల్వలు కాపాడుకోవడం, రోజువారీ లెక్కింపులు చేసుకోవడం, చిల్లర సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడేవారు. ప్రతిరోజూ బ్యాంకుల్లో నగదు జమ చేయడానికి పడే శ్రమ అంతాఇంతా కాదు. కానీ నేడు ఆ కష్టాలన్నీ కనుమరుగయ్యాయి. చిన్న టీ దుకాణం మొదలుకొని కూరగాయల వ్యాపారి వరకు క్యూఆర్ కోడ్ ద్వారా ఎలాంటి అదనపు యంత్రాల అవసరం లేకుండానే అత్యంత సులభంగా ఆన్‌లైన్ చెల్లింపులు స్వీకరిస్తున్నారు. మోదీ ప్రభుత్వం అందిస్తున్న పటిష్టమైన మద్దతుతో చిల్లర కోసం కస్టమర్‌ను వెనక్కి పంపాల్సిన అవసరం లేని సురక్షిత, పారదర్శక వ్యాపార వాతావరణం నేడు పల్లెపల్లెనా పరిఢవిల్లుతోంది. యూపీఐ సేవలు విస్తరిస్తున్న కొద్దీ పన్నులు విధిస్తున్నారంటూ తెరపైకి వస్తున్న అపోహలను 2026 సెప్టెంబర్ 15న కేంద్ర ఆర్థిక శాఖ తీవ్రంగా ఖండించింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలన్నీ సంపూర్ణంగా ఉచితమని, వినియోగదారుడు వ్యాపారికి చేసే రూ.2,000 వరకు చెల్లింపులపైనా ఎలాంటి రుసుము ఉండదని స్పష్టం చేసింది. నెలకు రూ.లక్ష లోపు యూపీఐ చెల్లింపులు పొందే చిన్న వ్యాపారులకు శూన్య వ్యాపారి తగ్గింపు రుసుము (ఎండీఆర్) కొనసాగుతుందని, 96 శాతం లావాదేవీలు కొత్త రుసుములకు అతీతమని కుండబద్దలు కొట్టింది. 2025 ఏప్రిల్‌లో రూ.2000 దాటితే జీఎస్టీ పడుతుందన్న ప్రచారం పచ్చి అబద్ధమని తేల్చింది. బ్యాంకుల సర్వర్ల నిర్వహణ, సైబర్ భద్రతకు భారీగా ఖర్చవుతున్నా ఆ భారం సామాన్యుడిపై పడకుండా, చిన్న వ్యాపారులను ప్రోత్సహించేందుకు 2025 ఆర్థిక సంవత్సరంలో మోదీ కేబినెట్ ఏకంగా రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలపడం పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. సాంకేతికత ఎంత సౌలభ్యాన్ని ఇచ్చినా ఉచితం కదా అని భద్రతాపరమైన జాగ్రత్తలు విస్మరించకూడదని రిజర్వు బ్యాంకు పదేపదే హెచ్చరిస్తూనే ఉంది. డబ్బు స్వీకరించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రహస్య సంఖ్య (పిన్) నమోదు చేయాల్సిన అవసరం లేదని, లావాదేవీని నిర్ధారించే ముందు గ్రహీత వివరాలు సరిచూసుకోవాలని సూచిస్తోంది. నకిలీ క్యూఆర్ కోడ్‌లు, సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేస్తూ కేంద్రం, ఆర్బీఐ నిరంతరం మౌలిక వసతులను అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. మనీ ఆర్డర్ యుగం నుంచి మొబైల్ చెల్లింపుల దాకా సాగిన ఈ ప్రయాణాన్ని ఒకే వాక్యంలో చెప్పాలంటే.. ఒకప్పుడు డబ్బు పంపడానికి మనిషి కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది, ఇప్పుడు ఆ కార్యాలయమే మన చేతిలోని ఫోన్‌లోకి వచ్చేసింది. ఇది ముమ్మాటికీ భారతీయ డిజిటల్ ప్రజా మౌలిక వసతుల విజయగాథ.. నవ భారతదేశ అద్భుత ప్రగతికి, ప్రభుత్వ విధానాల దార్శనికతకు నిలువెత్తు సాక్ష్యం.

**గడల నరసింహారావు.**
**అసోసియేట్ ఎడిటర్, మహాపత్రిక**



# తిన్న వెంటనే ఛాతీలో మంటా?

భోజనం చేసిన తర్వాత కొందరికి ఛాతీ, గొంతు లేదా కడుపు భాగంలో మంట, పుల్లటి తేన్పులు, ఆమ్లం పైకి వచ్చినట్లు అనిపించడం వంటి సమస్యలు తరచూ ఎదురవుతుంటాయి. అప్పుడప్పుడు వస్తే పెద్దగా పట్టించుకోకపోయినా.. ఇదే సమస్య పదేపదే వేధిస్తే కారణాన్ని తెలుసుకోవడం అవసరం. సాధారణంగా కడుపులోని ఆమ్లం అన్నవాహిక వైపు తిరిగి రావడాన్ని యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. అన్నవాహిక చివర ఉండే కండరాల వలయం కడుపు ఆమ్లం పైకి రాకుండా అడ్డుకునే కవాటంలా పనిచేస్తుంది. అది సరిగా పనిచేయకపోతే ఆమ్లం పైకి చేరి మంట, అసౌకర్యాన్ని కలిగించవచ్చు.

**రాత్రి భోజనం విషయంలో జాగ్రత్త**

రాత్రివేళ ఎక్కువ మోతాదులో భోజనం చేయడం, తిన్న వెంటనే మంచంపై పడుకోవడం రిఫ్లక్స్ సమస్యను పెంచే అవకాశం ఉంది. కడుపు నిండిన సమయంలో పడుకోవడం వల్ల ఆమ్లం పైకి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు. అందుకే రాత్రి భోజనాన్ని పరిమితంగా తీసుకోవడంతో పాటు, భోజనం చేసిన వెంటనే నిద్రపోకుండా కొంత విరామం ఇవ్వడం ఉపయోగకరంగా ఉంటుంది.

**ఆహారపు అలవాట్లూ కారణమే**

అధిక కొవ్వు కలిగిన ఆహారాలు, బాగా వేయించిన పదార్థాలు, కెఫీన్ ఉన్న పానీయాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్ వంటి కొన్ని ఆహారాలు కొంతమందిలో రిఫ్లక్స్ లక్షణాలను పెంచవచ్చు. అందరికీ ఒకే రకమైన ఆహారం సమస్యను కలిగించదు కాబట్టి, ఏ పదార్థం తీసుకున్న తర్వాత ఇబ్బంది ఎక్కువవుతుందో గమనించి దాన్ని తగ్గించడం మంచిది.

**బిగుతైన దుస్తులతోనూ ఇబ్బందే**

పొట్ట చుట్టూ ఎక్కువ ఒత్తిడి కలిగించే బిగుతైన దుస్తులు కొందరిలో అసౌకర్యాన్ని పెంచవచ్చు. అలాగే ఆహారాన్ని వేగంగా, ఒకేసారి ఎక్కువగా తినడం కంటే నెమ్మదిగా, తక్కువ పరిమాణాల్లో తీసుకోవడం మంచిది. భోజన సమయంలో తొందరపడకుండా ఉండటం కూడా జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఒత్తిడి కూడా ప్రభావం చూపొచ్చు**

మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి అంశాలు జీర్ణవ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపవచ్చు. కొంతమందిలో ఒత్తిడి పెరిగిన సమయంలో కడుపు సంబంధిత అసౌకర్యం ఎక్కువగా కనిపించవచ్చు. అందువల్ల తగిన నిద్ర, శారీరక చురుకుదనం, ప్రశాంతమైన జీవనశైలి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం.

**ధూమపానం, మద్యపానానికి దూరం**

ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు యాసిడ్ రిఫ్లక్స్ లక్షణాలను మరింత ఇబ్బందికరంగా మార్చే అవకాశం ఉంది. అందువల్ల వీటిని తగ్గించడం లేదా మానేయడం ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది.

**చిన్న మార్పులతో ఉపశమనం**

రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకోకుండా కనీసం రెండు నుంచి మూడు గంటల విరామం ఇవ్వడం, ఒకేసారి అధికంగా తినకుండా చిన్న పరిమాణాల్లో ఆహారం తీసుకోవడం, భోజనం తర్వాత కొద్దిసేపు నడవడం వంటి జీవనశైలి మార్పులు కొందరికి ఉపయోగపడవచ్చు. రాత్రివేళ రిఫ్లక్స్ ఎక్కువగా ఉంటే పడుకునే విధానంలో మార్పులు చేయడం గురించి వైద్య నిపుణుడి సలహా తీసుకోవచ్చు.అయితే ఛాతీలో మంట తరచూ రావడం, మింగడంలో ఇబ్బంది, తీవ్రమైన ఛాతీ నొప్పి, రక్తపు వాంతులు లేదా కారణం తెలియని బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే కేవలం ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చికిత్సనైనా నిపుణుల సలహాతోనే ప్రారంభించాలి.



# పిల్లల పెంపకంలో ప్రేమతో క్రమశిక్షణ



పిల్లల్ని పెంచడం తల్లిదండ్రులకు రోజురోజుకూ కొత్త సవాలే. చాలా కఠినంగా వ్యవహరిస్తే పిల్లల్లో భయం, దూరం పెరగవచ్చు. ప్రతి విషయంలోనూ అతిగా స్వేచ్ఛ ఇస్తే నియమాలు, బాధ్యతలపై అవగాహన తగ్గే అవకాశం ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తూ పిల్లలకు ప్రేమ, మద్దతుతో పాటు స్పష్టమైన హద్దులు ఏర్పరచే విధానాన్నే 'ఆథరిటేటివ్ పేరెంటింగ్'గా పిలుస్తారు.

పిల్లలతో మాట్లాడేటప్పుడు తల్లిదండ్రులు తమ నిర్ణయాలను కేవలం ఆదేశాల రూపంలో చెప్పకుండా, వాటి వెనుక ఉన్న కారణాన్ని కూడా వివరించడం ఈ విధానంలో ముఖ్యమైన అంశం. పిల్లల అభిప్రాయాలను వినడం, వారి భావాలను అర్థం చేసుకోవడం, తప్పు చేసినప్పుడు శిక్షించడంకంటే ఆ తప్పు ఎందుకు జరిగిందో వివరించి సరిదిద్దుకునే అవకాశం ఇవ్వడం ఇందులో భాగం.

ఇంట్లో నియమాలు స్పష్టంగా ఉండాలి. చదువు, ఆటలు, మొబైల్ వినియోగం, నిద్ర వంటి విషయాల్లో తల్లిదండ్రులు ముందుగానే కొన్ని హద్దులు నిర్ణయించుకోవచ్చు. అయితే పిల్లల వయసు, పరిస్థితి, అవసరాలను బట్టి ఆ నియమాల్లో కొంత సౌలభ్యం చూపడం కూడా అవసరం. తల్లిదండ్రుల్లో ఒకరు చాలా కఠినంగా, మరొకరు పూర్తిగా గారాబంగా వ్యవహరిస్తే పిల్లలకు ఏది సరైన ప్రవర్తనో అర్థం కాక గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది.

పిల్లలు తప్పు చేసినప్పుడు వెంటనే కోపంతో స్పందించకుండా, జరిగిన విషయాన్ని ప్రశాంతంగా చర్చించడం ఉపయోగకరం. ఉదాహరణకు పిల్లవాడు ఇతరుల వస్తువును అనుమతి లేకుండా తీసుకుంటే కేవలం మందలించడం కాకుండా, అది ఎందుకు తప్పో వివరించాలి. చేసిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా పిల్లవాడికే అర్థమయ్యేలా చెప్పాలి. ఇలా చేయడం వల్ల భయంతో కాకుండా బాధ్యతతో వ్యవహరించడం నేర్చుకునే అవకాశం ఉంటుంది.

ఈ పెంపక విధానంలో పిల్లల స్వతంత్ర ఆలోచనకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. చిన్న చిన్న విషయాల్లో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరగవచ్చు. ఏ దుస్తులు వేసుకోవాలి, చదువును ఎలా ప్లాన్ చేసుకోవాలి, ఖాళీ సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలి వంటి వయసుకు తగిన నిర్ణయాల్లో పిల్లలకు కొంత స్వేచ్ఛ ఇవ్వవచ్చు. తల్లిదండ్రులు ప్రతి విషయాన్నీ తమ నియంత్రణలో ఉంచడానికి ప్రయత్నించకుండా, అవసరమైనప్పుడు మార్గనిర్దేశం చేయడం మంచిది.

వయసు పెరిగే కొద్దీ పిల్లల అవసరాలు, ఆలోచనా విధానం కూడా మారుతాయి. చిన్నారులకు సరళమైన నియమాలు, రోజువారీ రొటీన్ అవసరం కాగా.. పాఠశాల వయసు పిల్లలతో సమస్యలను చర్చించి పరిష్కారం కనుగొనేలా ప్రోత్సహించవచ్చు. టీనేజర్ల విషయంలో వారి వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తూ, నిర్ణయాలు తీసుకునే సమయంలో వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం అవసరం.

పిల్లలకు చెప్పే మాటలకంటే తల్లిదండ్రుల ప్రవర్తన కూడా ఎంతో ప్రభావం చూపుతుంది. పెద్దలు కోపాన్ని ఎలా నియంత్రించుకుంటారు, ఇతరులతో ఎలా మాట్లాడతారు, తప్పు చేసినప్పుడు ఎలా స్పందిస్తారు అనే విషయాలను పిల్లలు గమనించి నేర్చుకుంటారు. అందుకే పిల్లల నుంచి కోరుకునే ప్రవర్తనను ముందుగా తల్లిదండ్రులే ఆచరణలో చూపించడం కీలకం.

ఆథరిటేటివ్ పేరెంటింగ్‌లో ప్రధాన ఉద్దేశం పిల్లల్ని భయపెట్టి నియంత్రించడం కాదు. ప్రేమతో కూడిన సంబంధాన్ని కొనసాగిస్తూనే బాధ్యత, క్రమశిక్షణ, స్వతంత్ర ఆలోచన వంటి లక్షణాలను పెంపొందించడమే. ఈ విధానంలో పెరిగే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని నిపుణుల అభిప్రాయాలు సూచిస్తున్నాయి.






# ఆయుర్వేద వైద్యం చాలా మంచిది

- ప్రాచుర్యం కల్పించాలి
- జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా** : ఆయుర్వేద వైద్యానికి తగిన ప్రాచుర్యం కల్పించాలని ఆయుర్వేద మందుల ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి ఆమె హాజరయ్యారు.కరోనా సమయంలో ఆయుర్వేదానికి మంచి ఆదరణ లభించిందని అప్పటినుండి జనాల్లో ఆయుర్వేదం వాడుకం పెరిగిందని అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం ఆయుర్వేద చికిత్స యొక్క ప్రాముఖ్యత గురించి గురించి ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ ప్రస్తావించారు. కార్యక్రమంలో దాదాపు 200 మందికి ఆయుర్వేద వైద్య పరీక్షలు చేసి ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు.అనంతరం జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్ లో జరిగిన 9వ పోషణ మాసోత్సవాల కార్యక్రమానికి అంగన్ వాడీలు జిల్లా అధికారులతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష హాజరయ్యారు. గర్భిణీలు చిన్నారుల ఆరోగ్యమే తమ కర్తవ్యమని అంగన్ వాడీలు ప్రతిజ్ఞ చేసారు.బాలింతలు గర్భిణీలు శిశువులకు ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆహార పదార్ధాల ప్రదర్శనను ఆమె తిలకించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవ డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్, డాక్టర్ అవినాష్ రాథోడ్, కన్వీనర్ డాక్టర్ ఇక్రముద్దీన్, డి పి ఎం డాక్టర్ ప్రీతల్ రాథోడ్, ఆయుర్వైద్యాధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ నర్మద, డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసిస్ట్ సుమన్ మహేందర్ నారాయణ సిద్ధార్థ ఆయుష్ సిబ్బంది యోగా ఇన్స్పెక్టర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# వైభవంగా గణేష్ శోభాయాత్ర

**క్యాతనపల్లి మహా :** గణపతి నవరాత్రులు పురస్కరించుకొని క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో కొలువైన గణనాథుడు భక్తుల నుండి విశిష్ఠపూజలు అందుకున్నాడు. కుంకుమార్చనలు, 108 రకాల ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో పట్టణంలోని ఆయా మండపాల వద్ద నవరాత్రులు సందడి వాతావరణం నెలకొంది. బుధవారం గణనాథుడు గోదావరి నది తీరంలోకి శోభాయాత్రగా భక్తుల కోలాహలాల నడుమ నిమజ్జనానికి బయలుదేరాడు. స్థానిక రాజీవ్ చౌక్ లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. పురపరిధిలోని ఉన్నటువంటి గణనాథుడు ఒక్కొక్కటిగా రాజీవ్ చౌక్ చేరుకొని భక్తుల ఆటాపాటలు, కోలాటాలు, నృత్యాల నడుమ భక్తులు లంబోధరున్ని నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై కళాకారులు భక్తిపారవశ్య నృత్యాలు చేస్తూ సందడి చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మందమర్రి సిఐ పర్స రమేష్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తును నిర్వహించారు.ఈ శోభాయాత్ర వేడుకలో పుర చైర్పర్సన్ గౌడిసెల సంధ్యారాణి రాజారమేష్, వైస్ చైర్పర్సన్ మిట్టపల్లి సరితశ్రీనివాస్, ఉత్సవ కమిటి సభ్యులు, ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# నిమజ్జనంలో చిన్నారుల సందడి

**మందమర్రి, మహా:** గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో మందమర్రి పట్టణంలోని బస్తీలు సందడిగా మారాయి. వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని పురస్కరించుకుని చిన్నారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో గణపతి ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉండగా, ఏటా మండపాల సంఖ్య కూడా పెరుగుతోంది. గతంలో పదుల సంఖ్యలో ఉన్న మండపాలు ప్రస్తుతం వందల సంఖ్యకు చేరుకోవడం ప్రజల్లోని భక్తి, ఉత్సవాలపై ఆసక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఉత్సవాలు ప్రారంభానికి ముందే చిన్నారుల సందడి మొదలైంది. వీధి వీధికి తిరుగుతూ చందాలు సేకరించడంతో పాటు మండపాల ఏర్పాటు, అలంకరణ, పూజా సామగ్రి కొనుగోలు వంటి కార్యక్రమాల్లో పిల్లలు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. తల్లిదండ్రులు, బస్తీవాసులు కూడా చిన్నారులను ప్రోత్సహిస్తూ తమ వంతు సహకారం అందించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం పూజలు, సాయంత్రం భజనలు, ఆటపాటలతో మండపాలు కళకళలాడాయి. అన్నదాన కార్యక్రమాల నిర్వహణలోనూ చిన్నారులు, యువత చురుకుగా పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు గణపయ్య సేవలో నిమగ్నమైన భక్తులకు నిమజ్జనోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రాక్టర్లు, లారీలు, డీసీఎంలపై వినాయక విగ్రహాలను ఊరేగి



స్తూ డీజే పాటలకు యువత, చిన్నారులు నృత్యాలు చేశారు. మహిళలు కోలాటాలతో సందడి చేయగా, గణపతి నామస్మరణతో పట్టణంలోని ప్రధాన రహదారులు మార్మోగాయి. మంచిర్యాల, ముల్కల, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మందమర్రి సీఐ రమేష్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హిందూ ఉత్సవ కమిటీ మందమర్రి శాఖ అధ్యక్షుడు బండారి సూరిబాబు, గోవర్ధనగిరి అనంతాచారి, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్ ఆధ్వర్యంలో ఉత్తమంగా అలంకరించిన గణనాథులకు బహుమతులు అందజేశారు. నిమజ్జనం పూర్తవడంతో పట్టణంలో ఉత్సవ సందడి తగ్గినా, వచ్చే ఏడాది గణపయ్య కోసం చిన్నారుల ఎదురుచూపులు ఇప్పటి నుంచే మొదలయ్యాయి.

## ఆన్లైన్ బెట్టింగ్ తో అప్పులపాలై యువకుడి ఆత్మహత్య

**బెల్లంపల్లి, మహా**: ఆన్లైన్ బెట్టింగుకు బానిసై అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెల్లంపల్లి మండలం బూదఖుర్దు గ్రామంలో జరిగిందని తాళ్ల గురజాల ఎస్సై తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ కి అలవాటు పడి, బెట్టింగ్స్ లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల బాధతో చీకటి రాజేశం (41) అనే యువకుడు బుధకుర్ద్ గ్రామంలో చెట్టు కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడనీ తెలిపారు .మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు .

# రిమ్స్ ను సందర్శించిన కవిత

- ప్రభుత్వం పై విమర్శలు
- ఏదీ సరిగా లేదని ఆగ్రహం
- మృతుల కుంబాలకు 50లక్షల పరిహారానికి డిమాండ్



**ఆదిలాబాద్ మహా:** రిమ్స్ ప్రమాదంలో శిశువుల మరణాలు భగవంతుడి తప్పిదం, ప్రకృతి కోపం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బుధవారం ఆమె పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యేలు బాపూరావు ,బోడ జనార్దన్‌లతో కలిసి రిమ్స్ ను సందర్శించారు. గతంలోనూ ఇదే ఆసుపత్రిలో వందలాది మంది చిన్నారులు మృతిచెందారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆసుపత్రుల్లో సిబ్బంది, సౌకర్యాలపై దృష్టి సారించాలని కోరారు. రిమ్స్‌లో అధికారులు సిబ్బంది, నిర్వహణ లోపాల కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని ఆసుపత్రిలో సరిపడా డాక్టర్లు, నర్సులు లేరని, ఏసీ మెకానిక్ కూడా అందుబాటులో లేరని అన్నారు. నిర్వహణకు అవసరమైన బడ్జెట్ ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రమాదంలో మృతిచెందిన శిశువుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ తరపున కమిటీ ఏర్పాటు చేసి, ఆసుపత్రిలోని ఆరోగ్య సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.



## ప్రత్యేక పూజలు నిర్వహించిన వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ సెప్టెంబర్ 23 మహా న్యూస్ :** వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధునికి వలిగొండ మాజీ జడ్పిటిసి వాకిటి పద్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ కు 5 వేల రూపాయల చందాను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు జాడ నవీన్, ఆవుల స్వామి, వార్డ్ సభ్యులు క్యాదరి మనిషా నరేష్, బి రాజు, మాజీ వార్డు సభ్యులు బత్తిని నగేష్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి చిలకమర్రి నరసింహ చారి, శ్రీనివాస్, తుమ్మల మురళి, ఆముద శ్రావణ్, క్యాదరి రాజు, బత్తిని సతీష్, ఆముద సాయిబాబా, చిలకమర్రి నరసింహ చారి, కొడితల లక్ష్మయ్య, బుర్ర శ్రీకర్, బత్తిని కర్ణ గౌడ్, జాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో ఘనంగా వినాయక నిమజ్జన ఉత్సవాలు

- పట్టణంలో శోభాయమానంగా కదులుతున్న వినాయక విగ్రహాలు
- పోచమ్మ చెరువు వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తిచేసిన అధికార యంత్రాంగం

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణంలో తొమ్మిది రోజులపాటు కొలువుదీరిన గణనాథులు పురవీధుల గుండా నిమజ్జనానికై పోచమ్మ చెరువు లో నిమజ్జనం చేసేందుకు భక్తుల కోల హాలాల మధ్య నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ తరిలాయి . నిమజ్జనానికి పోచమ్మ చెరువు వద్దకు తరలిస్తున్న విగ్రహాలనుకు స్థానిక సబ్ కలెక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, ఏసీపి కిరణ్ కుమార్ ల నేతృత్వంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు రూరల్ సిఐ హనుక్ల ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను లేదా పటిష్టంగా చేపట్టారు. మున్సిపల్ అధికార యంత్రాంగం క్రేన్ల సహకారంతో పోచమ్మ చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం జరిగింది. పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతను కల్పిస్తూ ట్రాఫిక్ నియంత్రణను చేపట్టడం జరిగింది.. వినాయక నిమజ్జనానికి తరుగుతున్న వినాయక విగ్రహాల ఊరేగింపునకు వర్షంతో కొంత ఇబ్బంది కలిగినప్పటికీ భక్తులు ఉత్సాహ భరిత వాతావరణంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడంలో కృతకృత్యులయ్యారు .



# వినాయక నిమర్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** వినాయక నవరాత్రుల నిమర్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన దండేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తనిఖీ చేసిన అనంతరం గూడెంలో నిమజ్జన ప్రాంతాన్ని ఎంపీడీవో ప్రసాద్, ఎస్సైలతో కలిసి పరిశీలించి, ముందస్తు భద్రతా చర్యలపై తగు సూచనలు చేశారు. ద్వారక గ్రామంలోని ఎస్టీ బాలుర వసతి గృహ పనులు, జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆ తర్వాత కేజీబీవీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు.మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, శుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు, పౌష్టిక ఆహారం అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు.ఈ పర్యటనలో స్థానిక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**వలిగొండ, మహా న్యూస్ :** వలిగొండ మండలంలో వినాయక నిమజ్జనం సందర్భంగా అక్క చెల్లెల చెరువు వద్ద బుధవారం మండల తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జలంధర్ రెడ్డి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి ఆర్ ఐ నగేష్ పంచాయతీ కార్యదర్శి రసూల్ పోలీస్ సిబ్బంది వైద్య సిబ్బంది ఫైర్ గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## గణపతి మండపం వద్ద అన్నప్రసాదం

భద్రాద్రి కొత్తగూడెం, మహా: అన్నం పరబ్రహ్మ స్వరూపమని మాజీ కౌన్సిలర్ బండారి అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 56 డివిజన్లో గణపతి నవరాత్రులు ఉత్సవంలో భాగంగా బాలగణపతి సేన ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని గోపు వెంకటరమణా రవీందర్ ల కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ బండారి పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారి మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారికి అన్నదానం ఒక పవిత్రమైన అర్పణగా భావిస్తారని తెలిపారు. వేల సంవత్సరాలుగా ఉన్న గొప్ప సంస్కృతి అని తెలిపారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఘనమైన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరం పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ జిల్లా నాయకులు మాజీ కౌన్సిలర్ రుక్మంగాధర్ బండారి, కార్పొరేటర్ గద్దం శాంతి ప్రియ, ఏమునూరి శివ, పంది రాజు, రజనీకాంత్, గద్దం ప్రభాకర్, పవన్, రాకేష్, మనోజ్, కిరణ్, భాస్కర్, నరేష్, రూప బండారి, మునిగ సుజాత, రాజ్య లక్ష్మి, సౌజన్య, సృజన, స్రవంతి, వరలక్ష్మి, సంధ్య, పావని తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా జీవించాలి వాకిటి

**వలిగొండ , మహా న్యూస్ :** వలిగొండ పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొల్పిన గణనాధునికి వలిగొండ మాజీ జడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల కళ్ళల్లో ఆనందం నిండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ గౌరవాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, అధ్యక్షులు భీమిని యాదిరెడ్డి కవిత, ఉపాధ్యక్షులు కొవ్వాకుల సాయి జ్యోతి, ప్రధాన కార్యదర్శి రచ్చ సునీత శ్రీనివాస్, కోశాధికారి మారోజు శాంత పోషణ చారి, సభ్యులు ఎడ్ల నవీన్ రెడ్డి, బత్తిని పాండు, జె ల్ల నరేందర్ పద్మ, చిందం మురళి నీరజ, కౌకుంట్ల బాల్ రెడ్డి, పసునూరి ప్రభాకర్, ఎలిమినేటి సుధాకర్, బుర్ర నరసింహ, చిందం సత్యనారాయణ, రావుల సంజీవరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుని సన్నిధిలో ఐఎన్‌టీయూసీ నేత కోటేశ్వరరావు

**పీవీఎన్ఆర్ కాలనీలో తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు**

**సత్తుపల్లి, మహా :** సింగరేణి పీవీఎన్ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీవాసుల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులకు కోటేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కోటేశ్వరరావుకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మల్లేష్, నాగప్రకాష్, రఘువీర్, షణ్ముఖచారి, దాసరి శీను, సందీప్, సతీష్, లక్ష్మణ్, రఘుపతి, నరేందర్, రాజేందర్, గోనె సతీష్‌కుమార్ , కాలనీవాసులు పాల్గొన్నారు.



# దాతృత్వాన్ని చాటుకున్న తాండూర్ మండల ఆటో కార్మికులు

- ఎన్ వై మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో

**బెల్లంపల్లి ,మహా**: పేదింటి అమ్మాయి పెళ్లికి ఆర్థిక సహాయాన్ని అందజేసి తాండూరు మండల ఆటో కార్మికులు సొసైటీ ఆధ్వర్యంలో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. బుధవారం నాడు ఆటో కార్మికుడు తాజ్ కుమార్తె వివాహానికి తాండూర్ మండల్ ఆటో యూనియన్ లోని కొంతమంది ఆటోకార్మికుల సహాయం తో పాటు ఎన్ వై మెమోరియల్ సొసైటీ సంయుక్తంగా ఆర్థిక సహాయాన్ని పెళ్లి కానుకగా అందించారు. ఈ సందర్భంగా తాండూర్ మండల్ ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎన్ వై మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకుడు ,భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ ఆడ బిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయాన్ని అందజేయడం తమ అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీను, తాండూర్ మండల సలహాదారులు బండి చందు, వైస్ ప్రెసిడెంట్ ముక్తార్ తో పాటు ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.



## స్టెప్పులేసిన ఎమ్మెల్యే ఆది...

**వేములవాడ,మహా;** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాగణపతి నిమర్జనం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి సరదాగా స్టెప్పులు వేసి కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక నిమర్జనం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంతోషంగా నిమర్జనం చేయాలని యువకులను, ప్రజలను సూచించారు.



## ఆదర్శ్ యూత్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాల్వ శ్రీరాంపూర్‌లో ఆదర్శ్ యూత్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై లక్కీ డ్రాను తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదర్శ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక నాయకులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### ఆదిలాబాద్‌లో బాసర జోన్

## డీఐజీ భాస్కరన్ పర్యటన

- నిమజ్జన ఉత్సవాలపై సమీక్ష
- క్షేత్రస్థాయిలో పరిశీలన
- రిమ్స్ సందర్శన
- చిన్నారుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

**ఆదిలాబాద్ మహా:** గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతవాతావరణం జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని బాసర జోన్ డీఐజీ భాస్కరన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిమజ్జన ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో సమీక్షించారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ తీగలు, వాహనాల రాకపోకలు, భక్తుల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.జైనథ్ మండలం పెనుగంగ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాన్ని డీఐజీ పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులు, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన డీఐజీ సీసీటీవీ కెమెరాల పనితీరు, పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించారు. గణపతి నిమజ్జన ఉత్సవాల సమయంలో సీసీటీవీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ప్రధాన ప్రాంతాలు, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ బందోబస్తును మరింత పటిష్టం చేయాలని తెలిపారు

**రిమ్స్ ను సందర్శించి డీఐజీ**

ఆదిలాబాద్ లో పర్యటించిన బాసర జోన్ డీఐజీ భాస్కరన్ రిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఇటీవల జరిగిన ఏసీ పేలుడు ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన జరిగిన సమయంలో 27 మంది చిన్నారులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఘటన అనంతరం చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని తెలిపారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులకు డీఐజీ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , అదనపు ఎస్పీలు పి. మౌనిక , బి. సురేందర్ రావు, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎం. వెంకట నర్సయ్య, పట్టణ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేలంలో రూ.3.47 లక్షలకు గణపతి లడ్డూ..

- నీరజా జువెలరీ అధినేత కంచర్ల శ్రీనివాస్ కైవసం
- హోరాహోరీగా సాగిన వేలంపాట

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో బంగారు, వెండి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలంపాట బుధవారం ఉత్సాహంగా సాగింది. వినాయకుడి చేతిలో ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని నీరజా జువెలరీ అధినేత కంచర్ల శ్రీనివాస్ రూ.3,47,116లకు దక్కించుకున్నారు. లడ్డూ కోసం నిర్వహించిన వేలంలో శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ జువెలరీ అధినేత దుగ్గి సతీష్, కంచర్ల శ్రీనివాస్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఒకరిని మించి మరొకరు ధర పలకడంతో వేలంపాట ఆసక్తికరంగా సాగింది. చివరకు కంచర్ల శ్రీనివాస్ రూ.3 లక్షల 47 వేల 116ల అత్యధిక ధర పలికి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న శ్రీనివాస్‌ను బంగారు, వెండి వర్తక సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, భక్తులు అభినందించారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ ప్రతినిధులు వి హనుమంతరావు, శ్రీనివాసరావు, నూడిల్స్ శంకర్, రవి, సుబ్రహ్మణ్యం, దేవత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్యే పై మాజీ మంత్రి ఫైర్

- కాంగ్రెస్ పార్టీ కి అమ్ముడు పోయాడని విమర్శ
- బానిస లాగా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా



**ఆదిలాబాద్ మహా:** ప్రతిపక్షసభ్యునిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంగ్రెస్ పార్టీ భజన చేస్తున్నారని మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రిమ్స్‌లో ఇటీవల జరిగిన ఘటనపై ఎమ్మెల్యే, ఎంపీ వైఖరిని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి మంత్రికి భజన చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ప్రచారానికే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, స్వార్ధ రాజకీయాలు చేయడం సరికాదన్నారు.ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో సరైన వైద్య సదుపాయాలు, మందులు లేకపోవడానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసమర్థతే కారణమని విమర్శించారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాల కోసం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే బానిసగా మారారని ఆరోపించారు. రిమ్స్ లో పసికందుల ప్రాణాలపై ఎక్స్ గ్రేషియాపై నిలదీయాల్సిన నీవు ప్రభుత్వ వైద్యారోగ్య శాఖా మంత్రితో హెలీక్యాప్టర్ లో రావడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. ఎయిర్ పోర్ట్‌కు అమ్ముడుపోయినవా లేదా ఇండస్ట్రియల్ కారిడార్‌కు అమ్ముడు పోయినవా ఏ విషయంలో ప్రభుత్వానికి అమ్ముడు పోయినవో స్పష్టం చేయాలని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కేమా శ్రీకాంత్, చందాల రాజన్న, అష్రాఫ్, దాసరి రమేష్, బట్టు సతీష్, పండ్ల శీను, డీవీటీ రాజు, బుట్టి శివ, వాగ్మారె ప్రశాంత్, అల్లకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## యూపీఐ లావాదేవీలు మీద చార్జీలు పెంచే ఆలోచనను విరమించాలి

- సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ నేత సత్యం

**కుషాయిగూడ, మహా :** యూపీఐ లావాదేవీల మీద సర్ చార్జి వేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని సిపిఐఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీస్ నుంచి ఈసీఎల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీకి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ యూపీఐ లావాదేవీల మీద కేంద్ర ప్రభుత్వం సర్ చార్జి వేచే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు దీనివలన వ్యాపారస్తులు నష్టపోతారని అసలే పెరిగిన రేట్లతో ఇబ్బందులు పడుతుంటే పుండు మీద కారం చల్లినట్టు ఈ చార్జీలు అమలు చేసే ఆలోచన చాలా దుర్మార్గమైనదన్నారు రూ. 2 వేల లోపు లావాదేవీలు జరిపే వాళ్లకు చార్జీలు ఉండవని కేంద్ర ప్రభుత్వం చెబుతుందని అదేవిధంగా లక్ష రూపాయలు లోపు వ్యాపారం చేసే వాళ్లకు సర్ చార్జి ఉండదని కేంద్ర ప్రభుత్వం చెబుతుందని ఈరోజుల్లో కూరగాయల వ్యాపారస్తులు కూడా లక్ష రూపాయలుపైనే వ్యాపారం చేస్తున్నారన్నారు. నోట్లు రద్దు అయినప్పుడు మోడీ నోట్ల వల్ల ఇబ్బందులు వస్తాయి కాబట్టి అందరూ డిజిటల్ లావాదేవీలు చేయాలని దేశవ్యాప్తంగా ప్రచారం చేయించారు దేశంలో దాదాపు 50% మంది పైగా డిజిటల్ లావాదేవీ నడుపుతున్నారని ఇప్పుడు కార్పొరేట్ల లాభాల కోసం చార్జీలు పెంచే ఆలోచన చేస్తున్నారని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు.పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ ఆలోచన వలన గూగుల్ పే ఫోన్ పే ఇంకా ఇతర కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం యుపిఐ లావాదేవీల మీద సర్ చార్జి పెంచే ఆలోచనలో ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర అశోక్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు జి యాదగిరిరావు, దేవి రెడ్డి శ్రీమన్నారాయణ, లీలావతి, జయరాజ్, పి గణేష్, ఎం శ్రీనివాసరావు, శోభ, గౌసియా, పీబీ చారి, సరోజిని పాల్గొన్నారు



## కిష్టారంలో వరద నీటి సమస్యపై సర్పంచ్ చొరవ

- ఏళ్లుగా పూడుకుపోయిన పంట కాలువకు మరమ్మతులు..
- అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ ప్రక్షాళన

**సత్తుపల్లి, మహా :** వర్షాలు కురుస్తున్న వేళ మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో వరద నీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గ్రామానికి సమీపంలో సింగరేణి కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని పెద్ద చెరువు నుంచి పంట కాలువ ద్వారా డ్యామ్ చెరువుకు చేరాల్సిన నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడటంతో వర్షపు నీరు నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ వ్యవస్థ స్తంభించడంతో కొన్ని ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల అభ్యర్థన మేరకు గ్రామ సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి అప్పారావు స్పందించారు. సుమారు పదేళ్లుగా మట్టితో పూడుకుపోయిన పెద్ద చెరువు పంట కాలువను పరిశీలించి, మరమ్మతు పనులు చేపట్టించారు. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయడంతో వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా అంబేద్కర్‌నగర్ కాలనీలో డ్రైనేజీకి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, వర్షపు నీరు నిలిచిపోకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ముందస్తుగా వర్షాభావ పరిస్థితులను అంచనా వేసి సమస్యాత్మక ప్రాంతాల్లో పనులు చేపట్టడంపై గ్రామస్థులు సర్పంచ్ రాజేశ్వరి అప్పారావును అభినందించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వర్షాకాలంలో కాలువలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుళ్ళ అప్పారావు, గ్రామ కార్యదర్శి అఖిల్, శీలం వెంకటేశ్వరరావు, మారోజు నాగేశ్వరరావు, నేరేటి సుధాకర్, పంచాయతీ గుమస్తా శంకర్, మారోజు నాగరాజు, ఎస్.కె సుభాని, గడ్డం రాజు, ఎస్.కే జానీ తదితరులు ఉన్నారు.

## పేకాట రాయుళ్లపై పోలీసుల కొరడా.. ముగ్గురి అరెస్టు

**జవహర్‌నగర్, మహా :** జవహర్‌నగర్ గోశాల సమీపంలో డబ్బులు పందెం పెట్టి పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి గోశాల సమీపంలో పేకాట జరుగుతున్నట్లు ఎస్ఐ కె.రమేష్‌కు సమాచారం అందింది. దీంతో పంచులతో కలిసి సిబ్బందితో అక్కడికి వెళ్లి దాడి చేశారు. పోలీసులను గమనించిన రవి, నాగరాజు, రాజు పరారయ్యారు. పిట్టల బాలయ్య, ఎర్రగుంట రాజు, దేవరుప్పుల మహేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు సెట్ల పత్తాలు, రూ.6,950 నగదు, రెండు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 వేలుగా పోలీసులు తెలిపారు. ఎస్ఐ రమేష్ ఫిర్యాదు మేరకు సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథులు..

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ లో వినాయక నవరాత్రులు ముగింపు దశకు చేరుకోవడంతో వాడవాడలా కొలువైన గణనాథులు నిమజ్జనం కోసం తొండుపల్లి చెరువు గంగమ్మ ఒడికి చేరుతున్నారు.భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి బప్పా మోరియా అంటూ జైకారాలు చేస్తూ, శోభాయాత్రలతో వినాయక విగ్రహాలను నిమజ్జన వేడుకలకు తరలిస్తున్నారు. జిహెచ్ఎంసి అధికారులు భారీ క్రేన్లు ఏర్పాటు చేశారు. నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలందుకున్న వినాయక విగ్రహాలను నిమజ్జననికి జిహెచ్ఎంసి సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.ఈ ఏడాది గణేశ ఉత్సవాలు వైభవంగా ముగుస్తున్నాయి.



## రూ.2.01 లక్షలకు లడ్డూ దక్కించుకున్న ఫ్రెండ్స్ గ్రూప్

**రాజేంద్రనగర్, మహా:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీలో ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ఫ్రెండ్స్ గ్రూప్‌కు చెందిన 11 మంది సభ్యులు సంయుక్తంగా పాల్గొని రూ.2,01,000కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, అక్కెం కృష్ణ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షులు కలిసి ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులకు లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులకు టీషర్టుల పంపిణీ

**పెద్దపల్లి మహా:** కాల్వశ్రీరాంపూర్: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మోట్లపల్లి గ్రామంలోని డప్పు కళాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన స్వర్గీయ జిలకర రామస్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారులు జిలకర రాకేష్, జిలకర నిశాంత్, జిలకర శ్రీకాంత్ ఈ టీషర్టులను అందజేశారు. తండ్రి జ్ఞాపకార్థం డప్పు కళాకారులకు టీషర్టులు అందజేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. స్వర్గీయ జిలకర రామస్వామి డప్పు కళాకారుడిగా గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో తనదైన సేవలందించారని గుర్తుచేశారు. ఆయన జ్ఞాపకార్థం రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని రాకేష్, నిశాంత్, శ్రీకాంత్‌లను కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుకు మహిళ దుర్మరణం

- మరో మహిళకు తీవ్ర గాయాలు
- వ్యవసాయ పనుల్లో విషాదం
- కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరు

పెద్దపల్లి మహా : వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళలపై పిడుగు రూపంలో మృత్యువు విరుచుకుపడింది. పత్తి చేనులో పనులు చేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ విషాద ఘటన జూలపల్లి మండలం భీమాజుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన మారం అంజవ్వ (55), కొత్తూరు గ్రామానికి చెందిన దోనూరి లక్ష్మి (48)తో పాటు మరికొందరు మహిళలు వ్యవసాయ పనుల కోసం భీమాజుపల్లికి వెళ్లారు. పత్తి చేనులో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా పిడుగు పడటంతో అంజవ్వ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అంజవ్వకు సమీపంలోనే ఉన్న దోనూరి లక్ష్మికి పిడుగుపాటు ప్రభావంతో గాయాలయ్యాయి. వెంటనే తోటి కూలీలు, స్థానికులు ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనతో చామనపల్లి, కొత్తూరు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అంజవ్వ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళ పిడుగుపాటుకు బలి కావడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పిడుగులు పడే సమయంలో వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



## గణనాథుని సన్నిధిలో ఐఎన్‌టీయూసీ నేత కోటేశ్వరరావు

**పీవీఎన్ఆర్ కాలనీలో తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు**

**సత్తుపల్లి, మహా :** సింగరేణి పీవీఎన్ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీవాసుల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులకు కోటేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కోటేశ్వరరావుకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మల్లేష్, నాగప్రకాష్, రఘువీర్, షణ్ముఖచారి, దాసరి శీను, సందీప్, సతీష్, లక్ష్మణ్, రఘుపతి, నరేందర్, రాజేందర్, గోనె సతీష్‌కుమార్ తదితరులతో పాటు కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పేద మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బుధవారం భద్రాచలం అంబ సత్రం మార్గంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మౌనిక నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు లతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ మూడో విడతలో అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమికి ముందే పనులు పూర్తి చేయాలి

- చేసే పనుల్లో నాణ్యత కనిపించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునరుద్ధరణ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం భద్రాచలం చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదుపరి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి వివిధ నిర్మాణ పనుల పురోగతి ప్రస్తుత దశ పూర్తికి అవసరమైన సమయం మానవ వనరులు నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు స్లాబ్‌లు రాతి పనులు రహదారుల అభివృద్ధి నిర్మాణ సామగ్రి లభ్యత సిబ్బంది సమీకరణ అదనపు నిధులు సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆలయ పునరుద్ధరణ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం మాడ వీధులు అంతర్గత ప్రాకారం బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

లిఫ్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మానవ వనరులను పెంచుకోవాలని సిబ్బంది కొరత వల్ల పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా సెంటరింగ్ తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని అవసరమైన చోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. స్లాబ్ పనుల్లో ఒక దశ పూర్తయ్యే వరకు తదుపరి దశకు సంబంధించిన ఏర్పాట్లు ఆలస్యం కాకుండా సమాంతరంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. పనుల మధ్య ఖాళీ సమయం తగ్గించి నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రతి పనికి వారంవారీ లక్ష్యాలను నిర్దేశించి ఆ లక్ష్యాల మేరకు పురోగతి లేకపోతే కారణాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. చివరి దశలో రాతి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందుగానే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. నిర్ణీత గడువులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు అండగా ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా...?

- గిరిజనులంటే వ్యవస్థకెందుకు చిన్నచూపు..
- జిల్లా ఎస్టీ మోర్చ అధ్యక్షుడు తంబళ్ళరవి నిర్బంధం పై గిరిజన సంఘాలు ఆందోళన.

**దమ్మపేట ,మహా :** ప్రజా స్వామ్య పాలనలో సాధారణ ప్రజలకు జీవించే హక్కే లేదన్నట్లుగా , ఖాకీల దే రాజ్యం అన్నచందంగా కొందరు పోలీసుల తీరు గిరిజనుల ను విస్మయానికి గురిచేస్తుంది. ఆదివాసి జిల్లా ఎస్టీ మోర్చ అధ్యక్షుడు తంబళ్ళ రవిని స్థానికంగా ఉన్న అశ్వారావుపేట పోలీసులు బైండోవర్ కేసు క్రింద అధుపులో కి తీసుకోవడాన్ని గిరిజన సంఘాలు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నాయి. ఈ మేరకు దమ్మపేట పట్టణ కేంద్రంలో గిరిజన సంఘాల నాయకులు ఆందోళన కు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం గ్రామానికి చెందిన ఓ గిరిజన యువకుడిని ఓ దొంగతనం కేసు విషయమై పలుమార్లు విచారణ నిమిత్తం పోలీసులు స్టేషన్ కు పిలిచినట్లు గిరిజనులు తెలిపారు. ఎక్కువగా బాదించడంతో సంబందిత యువకుడు అనుమానం తాళలేక విషమందు సేవించి మంగళవారం మృతి చెందినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసి జిల్లా ఎస్టీ మోర్చ అధ్యక్షుడు బాధితునికి జరిగిన అన్యాయం పై నిలదీస్తూ ,అండగా ఉండేందుకు యత్నాలు చేశాడు. విషయం గ్రహించిన పోలీసు అధికారులు ఎటువంటి అవాంచనీయ ఘటనలు ,ఆందోళనలు జరగకుండా ముందస్తుగా బైండోవర్ చేసి నిర్బంధం లోకి తీసుకున్నట్లు గిరిజన సంఘాలు ఆవేదన చెందారు.

**బాధితులకు అండగా ఉండటం నేరమా ?**

జరిగిన అన్యాయాన్ని అన్యాయం అని ప్రశ్నిస్తే నేరమా...? మనం ఏ యుగంలో ఉన్నామంటూ గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అమాయకులైన గిరిజనుల పై తప్పుడు కేసులు బనాయిస్తూ ,కొందరు వారి జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహించారు. ప్రశ్నించే నాయకుడినే భయబ్రాంతులకు గురిచేస్తే అసలైన నిజాన్ని ప్రశ్నించేవారెవరంటూ ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. బాదితులకు అండగా మహిళా మండలి నాయకులు సంఘీభావం వ్యక్తం చేస్తున్నారు.

# యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం



**రాజేంద్రనగర్, మహా:** విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉన్న సమయంలో కొందరు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని పెద్దగోల్కొండ రెవెన్యూ పరిధిలో మంత్ర ఫంక్షన్ హాల్ సమీపంలో గోదాం నిర్మాణ పనులకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నేరుగా విద్యుత్ తీగలు తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభం కూలిపోయి, వైర్లు నేలపై పడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కూలిన స్తంభం వద్దే విద్యుత్ తీగలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో పశువులు తిరుగుతుండటంతో ప్రమాదం మరింత పొంచి ఉందని చెబుతున్నారు. వైర్లలో విద్యుత్ సరఫరా ఉంటే మనుషులు, పశువులు సమీపానికి వెళ్లకుండా తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, అక్రమ కనెక్షన్ల కారణంగా షార్ట్‌సర్క్యూట్లు, ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడం, వైర్లు తెగిపడటం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. కూలిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ తీగలను సురక్షితంగా అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ విద్యుత్ వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.



# 7,61,000 ధర పలికిన బాకారం శివాలయం వినాయకుని లడ్డు

- లడ్డును కైవసం చేసుకున్న సామ ప్రభాకర్ రెడ్డి

**మొయినాబాద్ మహా:** మండలంలోని బాకారం జాగీర్ గ్రామంలోని శివాలయంలో ఎంతో అంగరంగ వైభవంగా ఏర్పాటుచేసిన గణనాథుని లడ్డూ వేలంపాటలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పోటాపోటీగా విగ్నేశ్వరుని వద్ద పూజలు అందుకున్న లడ్డు కోసం అధిక సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. హోరా హోరీ పోటీలో నవరాత్రులు పూజలు అందుకున్న లడ్డును 7,61,000/ రూపాయలకు సామ ప్రభాకర్ రెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,శివాలయం కమిటీ సభ్యులతో కలిసి లడ్డును సామ ప్రభాకర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా లడ్డు వేలంపాటలు దక్కించుకున్న వారు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సంతోషంగా గడపాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, గ్రామస్తులు యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మన్నెగూడలో బార్ అండ్ రెస్టారెంట్కు 2 వేల జరిమానా!

- నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ అధికారులు

**ఆదిభట్ల సెప్టెంబర్ 23 మహా:** మన్నెగూడలోని బార్ అండ్ రెస్టారెంట్ కు రెండు వేల రూపాయల జరిమానా విధించిన జిహెచ్ఎంసి అధికారులు. జిహెచ్ఎం ఆదిభట్ల సర్కిల్, మన్నెగూడలోని సుచిరుచి బార్ అండ్ రెస్టారెంట్ నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ శానిటేషన్ అధికారులు బార్ వద్దకు చేరుకుని తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని యాజమాన్యానికి రూ.2 వేల జరిమానా విధించారు. మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని బార్ నిర్వాహకులను హెచ్చరించారు.



# కుషాయిగూడలో 5 వేల మంది విద్యార్థినులతో మహా హారతి

- యువసేన ఆధ్వర్యంలో మహా గణపతికి అఖండ హారతి
- భక్తి గీతాలతో మారుమోగిన టీజీఐఐసీ కాలనీ మైదానం

**కుషాయిగూడ, మహా:** టీజీఐఐసీ కాలనీ మైదానంలో యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మహా గణపతికి వసుందర కళాశాలకు చెందిన 5 వేల మంది విద్యార్థినులతో మహా హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి గణనాథుడికి అఖండ హారతి ఇచ్చారు. ఒకేసారి వేలాది మంది విద్యార్థినులు ప్రమిదలతో మహా హారతి ఇవ్వడంతో మైదానం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గణపతి భజనలు, భక్తి గీతాలతో పరిసరాలు మారుమోగాయి. అనంతరం విద్యార్థినులతో కలిసి నిర్వహించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువసేన ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా మహా గణపతిని ప్రతిష్ఠించి 13 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం రోజున వేలాది మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం బాజా భజంత్రీల నడుమ నిమజ్జనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది వినూత్నంగా విద్యార్థినులతో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారిలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. వేలాది మంది విద్యార్థినులతో కలిసి మహా హారతి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలు.. ప్రజల సౌభ్రాతృత్వానికి వేదికలు.

- ఐకమత్యానికి చిహ్నాలు... ప్రజల అవగాహనకు సూచికలు.
- జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి.

**జవహర్ నగర్, మహా :** గణేష్ మండపాలు ప్రజల సౌభ్రాతృత్వానికి వేదికలని సమాజపు ఐక్యమత్యానికి చిహ్నాలని ప్రజల అవగాహనకు సూచికలని జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి పేర్కొన్నారు. జవహర్ నగర్ లో గణేష్ సురక్ష సంకల్ప్ 2026 లో భాగంగా మల్కాజిగిరి సిపి సుమతి ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు ఒక్కొక్క ప్రోగ్రాం మీద గణేష్ మండపాల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఏసిపి చక్రపాణి హాజరై మాట్లాడుతూ ఈనెల 15, 16వ తేదీలలో యాంటీ డ్రగ్స్ మీద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని అదేవిధంగా 17, 18 వ తేదీలలో ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ మీద అదేవిధంగా 19, ఇంకా20వ తేదీ నాడు ఉమెన్స్ సేఫ్టీ షీ టీమ్లు మీద 21, ఇంకా 22వ తేదీలలో సైబర్ సేఫ్టీ మీద అదే విధంగా 23వ తేదీ నాడు ఫుడ్ సేఫ్టీ అండ్ ఫుడ్ అలర్ట్రేషన్ మీద ప్రజలకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. గణేష్ మండపాలు ప్రజల అవగాహనకు వేదికలని అందువలన గణేష్ మండపాల వద్ద కార్యక్రమాలు సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పండుగలు సర్వ మానవ సంస్కృతిలో భాగమని అట్టి పండుగలు నిర్వహించుకుంటూ దేశ ఔన్నత్యాన్ని సర్వ సమానత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. భారత జాతి ఐక్యతే ముఖ్యమని దేశ అభివృద్ధికి ప్రజలందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశ యువత ఇప్పుడు జెన్ జీ తరంతో ముందుకు దూసుకెళ్తుందని ఈ తరం దేశ అభివృద్ధికి దేశ సాంకేతిక నైపుణ్యాలకు ఊతమిచ్చేలా దేశ అభివృద్ధి ప్రపంచం గుర్తించేలా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదులు, పోలీస్ స్టేషన్ సెక్టార్ ఎస్ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మారెళ్లపాడు లిఫ్ట్‌తో రైతుల కల సాకారం..

- పినపాక రైతాంగానికి సాగునీటి భరోసా..
- వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు..
- సీతారామ ప్రాజెక్టులో భాగంగా లిఫ్ట్ ప్రారంభం
- మంత్రులు పొంగులేటి, తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**మణుగూరు, మహా :** ఎన్నో ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ రైతాంగం కల సాకారమైంది. అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను బుధవారం రాష్ట్ర మంత్రులు ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం అందుబాటులోకి రావడంతో కొన్ని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా అశ్వాపురం మండలంలోని ఆయకట్టు భూములకు గోదావరి జలాలు చేరనుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ పాల్గొన్నారు. కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఎఫ్‌వోతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఇరిగేషన్ శాఖ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ తెల్లం వెంకటేశ్వర్లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

**రైతుల చిరకాల స్వప్నం నెరవేరింది: పాయం**

మారెళ్లపాడు లిఫ్ట్ ప్రారంభం పినపాక నియోజకవర్గ రైతాంగానికి ఎంతో సంతోషకరమైన రోజని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగునీటి కల నేడు సాకారమైందన్నారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఈ లిఫ్ట్ అందుబాటులోకి రావడంతో అశ్వాపురం మండలంతో పాటు నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి భరోసా మరింత బలోపేతమవుతుందని తెలిపారు. లిఫ్ట్ ద్వారా కొన్ని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని, తద్వారా రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుందని చెప్పారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పంటల దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

**గోదావరి జలాలతో పొలాలకు కొత్త కళ**

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగుకు వినియోగించుకోవడంతో పినపాక ప్రాంత రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సాగునీటి వసతి మెరుగుపడితే వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందన్నారు. ముఖ్యంగా అశ్వాపురం మండలంలోని ఆయకట్టు భూములకు నీటి లభ్యత పెరగడం రైతులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా సాగునీటి వసతులను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మారెళ్లపాడు లిఫ్ట్ ప్రారంభంతో అశ్వాపురం మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుడి నిమజ్జనం

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద బుధవారం గణపతి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పోలీస్ యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భారీ క్రేన్ సహాయంతో ఎల్లమ్మ గుండమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో చెరువు పరిసరాలు మార్మోగాయి. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే విజయరమణారావు నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలి

- జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి కృషిచేయాలి..
- ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- డీసీసీ ప్రెసిడెంట్ పారిజాతకు మల్‌రెడ్డి రంగారెడ్డి సూచనలు...
- మల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షురాలు..



**బాలాపూర్ సెప్టెంబర్ 23 మహా:** కష్టపడి పని చేసిన కార్యకర్త ఏ స్థాయికైనా ఎదిగే అవకాశం కాంగ్రెస్‌లో మాత్రమే ఉంటుందని, డీసీసీ ప్రెసిడెంట్‌గా పారిజాత నియామకమే ఇందుకు నిదర్శనంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన చిగురింత పారిజా తానర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా తిరుమలహిల్స్‌లోని నివాసంలో మల్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే... కొత్తబాధ్యతల్లో మంచిపేరు తెచ్చుకోవాలని చెప్పారు.

**పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి...**

కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి గారు సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్‌ను జిల్లాలో మరింత బలోపేతం చేయాలని చెప్పారు. కార్యకర్తలు, నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మల్‌రెడ్డి... రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. డీసీసీ అధ్యక్షులుగా నియామకంలో సహకరించిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పారిజాత నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.



# అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో శ్రీ మహాగణాధిపతి నవరాత్రులు

- కామాఖ్యా దేవాలయం చైర్మన్ సతీష్ భవాని దంపతులచే గురుపూజ
- పది మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న అంజనీపుత్ర సంస్థ

**మంచిర్యాల, మహా :** అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో శ్రీ మహాగణాధిపతి నవరాత్రులు ముగింపు కార్యక్రమానికి మందమర్రి కామాఖ్యా దేవాలయం చైర్మన్, లలిత త్రిపుర సుందరి దేవి ఉపాసకులు సతీష్ భవాని దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, గురుపూజను కనులపండువగా జరిపించారు.అనంతరం భక్తులను ఉద్దేశించి సతీష్ భవాని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ వందలాది మందికి ఉపాధి కల్పిస్తూ సమాజానికి ఎంతో సేవ చేస్తోందని ప్రశంసించారు. ఒకనొక సందర్భంలో అర్జునుడు శ్రీకృష్ణుడిని ప్రపంచంలో మీకు అత్యంత ఇష్టమైనది ఏమిటి అని ప్రశ్నించగా నాకు నైవేద్యాలు పెట్టడం కంటే పేదవాడికి అన్నం పెట్టడం మిన్న. పదిమందికి సహకరించి, తోటివారికి ఉపయోగపడే పనులు చేసేవారే నాకు అత్యంత ప్రీతిపాత్రులు అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్లు గుర్తుచేశారు. కేవలం ఒక వ్యక్తిగా ప్రారంభమైన అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ నేడు మహోన్నత శక్తిగా ఎదిగిందని కొనియాడారు. శ్రీ మహాగణపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఈ సంస్థపై, ప్రజలందరిపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంజనీపుత్ర రియల్ ఎస్టేట్స్ యాజమాన్యం గుర్రాల శ్రీధర్ సతీష్ భవాని దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి, పాదపూజ నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా సతీష్ స్వామీజీ భక్తులకు అమూల్యమైన ప్రవచనాలు బోధించి ఆధ్యాత్మిక మార్గాన్ని వివరించారు. ఈ ఉత్సవాల్లో స్థానిక భక్తులు, సంస్థ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మహా గణపతి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# వానలోనూ గణనాథుడి నిమజ్జన జోష్

**మణుగూరు, మహా:** జోరుగా వర్షం కురుస్తున్నా మణుగూరు పట్టణంలో గణనాథుడి నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. భక్తులు వర్షాన్ని లెక్కచేయకుండా నిమజ్జన ఊరేగింపుల్లో పాల్గొని గణపతి బప్పా మోరియా నినాదాలతో సందడి చేశారు. యువత డప్పుచప్పుళ్లకు నృత్యాలు చేస్తూ, చిందులు వేస్తూ ఉత్సవానికి మరింత జోష్ తీసుకొచ్చారు. మహిళలు, చిన్నారులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ ప్రధాన సెంటర్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 47వ వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కోలాటాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళల బతుకమ్మ ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భవాని ఎలక్ట్రికల్స్ రూ.16 వేలకు లడ్డూను దక్కించుకుంది. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసిన సత్యనారాయణను ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ, ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన మహా అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనాల నేపథ్యంలో సీఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, ఊరేగింపు మార్గాల్లో సిబ్బందిని మోహరించి కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు.

# బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం నాడు స్పష్టం చేశారు. బుధవారం రోజు ఇందిరా భవన్ న్యూఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. సందర్భంగా ఆయన ఎఐసిసి అధ్యక్షుడితో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు,బలోపేతం పై చర్చించినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో బెల్లంపల్లి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు,పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, నాయకులు -కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేయడం వంటి అంశాలపై చర్చించి నట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలను,బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం,క్షేత్రస్థాయిలో పార్టీకార్యక్రమాల అమలు తదితర అంశాలను,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీ అభివృద్ధి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేయడం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.



# సంప్రదాయాలను పరిరక్షించుకుందాం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సమాజంలో భక్తిభావంతో పాటు సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ అత్యంత ముఖ్యమని ఇది మన అందరి బాధ్యతని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం కొత్తగూడెం పట్టణం పరిసర ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నిర్వాహకులకు ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలుచోట్ల ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ఎమ్మెల్యే కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ ద్వారా ప్రజల మధ్య సద్భావన వెల్లివిరుస్తుందని సంస్కృతిని కాపాడుతూ సేవా దృక్పథంతో సామాజిక కార్యక్రమాలు చేపట్టడంలో యువత ఉత్సవ కమిటీల చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కమిటీలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాలు పరిసర ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి భంగం కలగకుండా కార్పొరేషన్ గ్రామ పంచాయతీ అధికారులు నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, నాయకులు పల్లపోతు సాయి, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, లగడపాటి రమేష్, సానబోయిన రాజు, యస్వంత్, ఆంటోని, దాసరి రామారావు, పొన్నం అజయ్, భరత్, జేమ్స్, స్టాలిన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలోనూ పోలీసుల సహాయక చర్యలు



**హసన్‌పర్తి, మహా:** భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా ఎన్‌హెచ్ 563పై భారీ వృక్షం కూలిపోవడంతో హసన్‌పర్తి పోలీసులు వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించారు. బుధవారం హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆంధ్రా బ్యాంక్ సమీపంలో చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోయింది.గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్‌కు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగించారు. అనంతరం రహదారిని పూర్తిగా క్లియర్ చేసి కొద్దిసేపటికే వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు తక్షణమే స్పందించడంపై స్థానికులు, వాహనదారులు అభినందించారు. విపత్కర పరిస్థితుల్లోనూ విధి నిర్వహణతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు చేపట్టిన చర్యలపై ప్రశంసలు వెల్లువెత్తాయి.



# నిమజ్జన సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద
- మందమర్రిలో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు
- మంత్రి గడ్డం వివేక్‌కు స్వాగతం పలికిన ఇందు ఉత్సవ కమిటీ సభ్యులు

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగింది. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న గణనాథులకు, భక్తులకు ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సభాస్థలికి వచ్చిన గణనాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుని ఆశీస్సులు పొందారు. అనంతరం పట్టణ ప్రజలకు, భక్తులందరికీ నిమజ్జన శుభాకాంక్షలు తెలిపారు. నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా ముగియాలని ఆయన అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేకానందకు స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవంలో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బండారి సూరిబాబు, బోరిగం వెంకటేష్, కనకం రవీందర్, పల్లె నర్సింగ్ పాల్గొన్నారు. ఈ వేడుకలో భారీ సంఖ్యలో భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని గణనాధునికి నివాళులు అర్పించారు.



# మానకొండూరు చెరువు వద్ద నిమజ్జనం

**కరీంనగర్, మహా:** కరీంనగర్ జిల్లా మానకొండూరు చెరువు వద్ద వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నిమజ్జనానికి ముందు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి వీడ్కోలు పలికేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల జై గణేశ్ నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులు సంయమనంతో, పూర్తి జాగ్రత్తలతో నిమజ్జన వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను ముగించాలని కోరారు.

# అక్రమ టేకు కలపపై టాస్క్‌ఫోర్స్ కొరడా

- అంకంపాలెం బీట్‌లో రూ.7.05 లక్షల విలువైన 5.235 క్యూబిక్ మీటర్ల టేకు కలప పట్టివేత.



**దమ్మపేట, మహా :** మండలం లోని అంకంపాలెం బీట్ లో అటవీశాఖ అధికారులు పంజా విసిరారు. అక్రమంగా నిల్వ చేసిన 7.00లక్షల విలువైన టేకు కలపను బుధవారం స్వాధినం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేంజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడం, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా కలపను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి అక్రమాలకు అటవీ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని అన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా జిల్లాలో అక్రమ కలప నరికివేత, నిల్వ, రవాణాపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

**24×7 కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారంతో వేగవంతమైన చర్య**

అటవీ నేరాల నియంత్రణ, అటవీ సంపద రక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో భాగంగా జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకంగా పనిచేస్తోంది. ఈ కేంద్రం 24×7 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పనిచేస్తోంది. అంకంపాలెం బీట్ లో అనుమతులు లేకుండా టేకు కలపను అక్రమంగా నిల్వ చేసినట్లు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సంబంధిత టాస్క్‌ఫోర్స్ బృందానికి వెంటనే సమాచారం చేరవేశారు. సమాచారం అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్ ఎఫ్ ఆర్ ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దమ్మపేట రేంజ్ అధికారులు, బీట్, సెక్షన్ అధికారులు , సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందిన 24 గంటల్లోనే టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమ కలప నిల్వను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, అటవీ నేరాల నియంత్రణలో వేగవంతమైన సమాచార వ్యవస్థ, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది.

**అంకంపాలెం బీట్‌లో భారీగా టేకు కలప పట్టివేత**

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అంకంపాలెం బీట్ లో తనిఖీలు నిర్వహించి, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను గుర్తించి స్వాధీనం చేసుకుంది.అధికారులు నిర్వహించిన కొలతల్లో 57 టేకు రౌండ్ దుంగలు - 2.775 క్యూబిక్ మీటర్లు, 44 టేకు సాన్ సైజులు - 2.460 క్యూబిక్ మీటర్లు ఉన్నట్లు నిర్ధారించారు.

మొత్తంగా 5.235 క్యూబిక్ మీటర్ల టేకు కలప, సుమారు రూ.7.05 లక్షల విలువైన అటవీ సంపదను స్వాధీనం చేసుకున్నారు.

**రైతు వద్ద కొనుగోలు చేశాను" నిందితుడు.**

కలపను నిల్వ ఉంచిన వ్యక్తిని అధికారులు విచారించగా, తాను ఈ టేకు కలపను ఒక రైతు వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే సంబంధిత చెట్లను నరికివేయడానికి అవసరమైన అనుమతులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు విచారణ చేపట్టారు.అనుమతులు లేకుండా నరికిన చెట్ల నుంచి వచ్చిన కలపను కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా అది చట్టబద్ధమైన కలపగా మారదని అధికారులు స్పష్టం చేశారు. అటవీ శాఖ అనుమతులు, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడం వర్తించే అటవీ చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలకు దారితీస్తుందని తెలిపారు.

కలప కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ దాని మూలం, అనుమతులు, రవాణా పత్రాలు, చట్టబద్ధతను తప్పనిసరిగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు.

**అటవీ సంపద రక్షణకు నిరంతర నిఘా***

అక్రమంగా చెట్లను నరికివేయడం వల్ల కేవలం కలప సంపద మాత్రమే కాకుండా, జీవవైవిధ్యం, వన్యప్రాణుల ఆవాసాలు, నేల సంరక్షణ, నీటి వనరులు, పర్యావరణ సమతుల్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అధికారులు తెలిపారు.

అటవీ సంపదను కాపాడటం అటవీ శాఖతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అక్రమ కలప నరికివేత, నిల్వ లేదా రవాణా గురించి సమాచారం తెలిసిన వారు అటవీశాఖకు తెలియజేసి అటవీ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

స్వాధీనం చేసుకున్న మొత్తం టేకు కలపను దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి సమక్షంలో అంకంపాలెం బీట్ అధికారి ఏ. పార్వతి సురక్షిత కస్టడీకి అప్పగించారు. ఘటనపై వర్తించే అటవీ చట్టాలు, నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

**తనిఖీల్లో పాల్గొన్న అధికారులు**

ఈ చర్యల్లో టాస్క్‌ఫోర్స్ బృందంFRO శ్రీనివాస్ , సెక్షన్ అధికారులు లోకనాదం , ప్రసాద లింగం , బీట్ అధికారి రాములు , దమ్మపేట FRO శ్రీను , బీట్ అధికారులు పార్వతి, కాంతారావు, రాజారమేష్ ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్, కలెక్టరేట్, మహా:** భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగులు, నాలాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున వాగులు, కాలువలు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ప్రజల అవసరాల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నా, అత్యవసర సహాయం అవసరమైనా టోల్‌ఫ్రీ నంబర్ 18004253424 లేదా 9154252936కు సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ది ప్యారడైజ్‌లో కీర్తి సందడి

**హైదరాబాద్, మహా:** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ సినిమాలో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్న విషయం ఇప్పటికే వెల్లడైంది. తాజాగా ఈ పాటకు సంబంధించిన కొన్ని బిహైండ్ ది సీన్స్ ఫొటోలను కీర్తి సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

'ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాలా' పేరుతో రూపొందిన ఈ ప్రత్యేక గీతంలో కీర్తి సంప్రదాయ దుస్తుల్లో కనిపించనున్నారు. రంగురంగుల దుస్తులు, పూల అలంకరణ, పండుగ వాతావరణాన్ని తలపించే సెటప్‌తో పాటను చిత్రీకరించినట్లు ఫొటోలు వెల్లడిస్తున్నాయి. నానితో కలిసి కీర్తి చేసిన డ్యాన్స్ సన్నివేశాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి.కీర్తి సురేష్, నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ ప్రేక్షకులకు కొత్తది కాదు. ఈ ముగ్గురూ గతంలో 'దసరా' కోసం కలిసి పనిచేశారు. అదే బృందంతో మరోసారి పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందంటూ కీర్తి తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. 'ది ప్యారడైజ్' బృందానికి శుభాకాంక్షలు చెబుతూ, పాట కోసం పనిచేసిన సాంకేతిక బృందాన్ని కూడా ఆమె అభినందించారు.

ఇక ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. జంగి రెడ్డి, ప్రభా గానం చేశారు. ఆట సందీప్ కొరియోగ్రఫీ చేశారు. జానపద సంగీత అంశాలను ఆధునిక బీట్‌లతో మేళవించిన ఈ పాటకు విడుదలైన తర్వాత మంచి స్పందన వచ్చినట్లు సినీ వర్గాలు పేర్కొన్నాయి.

కీర్తి సురేష్ తన సినీ ప్రయాణంలో విభిన్న పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్నారు. 'మహానటి'తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఆమె, నానితో కలిసి 'నేను లోకల్', 'దసరా' వంటి చిత్రాల్లో నటించారు. ఇప్పుడు 'ది ప్యారడైజ్'లో ప్రత్యేక పాట ద్వారా మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

నాని, కీర్తి సురేష్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసి ఈ ప్రత్యేక గీతంపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. సినిమా విడుదలకు ముందు ఈ పాటలోని కీర్తి లుక్, నానితో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందనే దానిపై అభిమానుల్లో చర్చ కొనసాగుతోంది.



### ఓటీటీలోకి హ్యూమా ఖురేషి

# క్రైమ్ థ్రిల్లర్

**హైదరాబాద్, మహా:** క్రైమ్, యాక్షన్, మిస్టరీ అంశాలతో రూపొందిన బాలీవుడ్ చిత్రం 'బేబీ డూ డై డూ' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హ్యూమా ఖురేషి ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా సెప్టెంబర్ 23 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. జూలై 3న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ వేదికపై అందుబాటులోకి వచ్చింది. నచికేత్ సమంత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హ్యూమా ఖురేషి 'బేబీ కర్మార్కర్' పాత్రలో కనిపించారు. వినికిడి, మాట సామర్థ్యం లేని మహిళగా కనిపించే ఆమెకు మరో రహస్య జీవితం ఉంటుంది. ఆమె ఒక కాంట్రాక్ట్ కిల్లర్‌గా పనిచేస్తూ ప్రమాదకరమైన నేర ప్రపంచంలో అడుగుపెడుతుంది. అయితే వ్యక్తిగత ప్రతీకారం, గతంలో జరిగిన విషాద ఘటనలు ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పుతాయి. ఓ హత్యా ఆపరేషన్ అనూహ్యంగా క్లిష్టంగా మారడంతో బేబీపై పోలీసుల దృష్టి పడుతుంది. దీంతో ఆమె దాచుకున్న జీవితానికి సంబంధించిన అనేక విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. తన గతానికి సంబంధించిన నిజాలను తెలుసుకోవాలనే ప్రయత్నంలో ఆమె ఎదుర్కొనే సంఘటనలు కథలో ఉత్కంఠను పెంచుతాయి. సినిమా కథలోని కీలక మలుపులను తెరపైనే చూడాల్సి ఉంటుంది.హ్యూమా ఖురేషితో పాటు సికందర్ ఖేర్, చుంకీ పాండే, సీమా పహ్వా, రాచిత్ సింగ్, విద్యా మాల్వాడే తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సాకిబ్ సలీమ్, హ్యూమా ఖురేషి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రైమ్, యాక్షన్‌తో పాటు డార్క్ కామెడీ, మిస్టరీ అంశాలను కథలో మేళవించినట్లు చిత్ర బృందం తెలిపింది. సుమారు రెండు గంటల ఐదు నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రం థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులకు ఇప్పుడు ఓటీటీ ద్వారా అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా విభిన్నమైన క్రైమ్ కథలు, ప్రతీకార నేపథ్యంతో సాగే థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడేవారికి ఈ సినిమా ఆసక్తికరంగా ఉండే అవకాశం ఉంది.




# విదేశాల్లోనూ హనుమాన్ అంష్ జోరు

**హైదరాబాద్, మహా:** తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి భారీ విజయాన్ని అందుకుంటున్న 'హనుమాన్ అంష్' చిత్రం బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తోంది. దేశీయ మార్కెట్‌లో ఊహించని స్థాయిలో ఆదరణ పొందిన ఈ భక్తి ప్రధాన చిత్రం తాజాగా ఓవర్సీస్ మార్కెట్‌లోనూ అరుదైన మైలురాయిని అందుకుంది. అంతర్జాతీయ విడుదలైన 12 రోజుల్లోనే 3.5 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత ప్రయాణం ఆధారంగా రూపొందింది. ఆగస్టు 7న భారత్‌లో విడుదలైన ఈ సినిమాకు తొలి రోజుల్లో పెద్దగా వసూళ్లు రాలేదు. కేవలం రూ.10 లక్షల ఓపెనింగ్‌తో ప్రారంభమైనప్పటికీ.. ప్రేక్షకుల నుంచి వచ్చిన సానుకూల స్పందనతో మూడో వారం నుంచి సినిమా కలెక్షన్లు గణనీయంగా పెరిగాయి. దేశీయంగా వసూళ్లు పెరగడంతో సెప్టెంబర్ 11న అంతర్జాతీయ మార్కెట్లలో చిత్రాన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో తక్కువ సమయంలోనే భారీ వసూళ్లు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా మార్కెట్ చిత్రానికి కీలకంగా మారింది. అంతర్జాతీయ విడుదలైన ఆరు రోజుల్లోనే అక్కడ ఒక మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటినట్లు ట్రేడ్ నివేదికలు పేర్కొన్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా సినిమా వసూళ్లు కూడా గణనీయంగా పెరిగాయి. సెప్టెంబర్ 23 నాటికి ట్రేడ్ గణాంకాల ప్రకారం భారత్‌లో నెట్ కలెక్షన్లు రూ.280 కోట్లకు పైగా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్లు రూ.366 కోట్లకు చేరువయ్యాయి. ఈ క్రమంలో 'టాక్సిక్', 'పెద్ది', 'జన నాయకన్' వంటి భారీ చిత్రాల ప్రపంచవ్యాప్త వసూళ్లను కూడా 'హనుమాన్ అంష్' అధిగమించినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.





# గోవిందా వ్యవహారంపై సునీత స్పందన

**ముంబై, మహా:** బాలీవుడ్ నటుడు గోవిందా, ఆయన భార్య సునీత ఆహూజా మరోసారి వార్తల్లో నిలిచారు. ముంబైలోని లాల్‌బాగ్చా రాజా గణేశుడిని గోవిందా తన సహనటి కోమల్ రాణి స్వర్ణకర్‌తో కలిసి దర్శించుకోవడం చర్చనీయాంశంగా మారింది. అదే రోజు ఉదయం సునీత కూడా లాల్‌బాగ్చా రాజాను ఒంటరిగా దర్శించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మరుసటి రోజు మీడియాతో మాట్లాడిన సునీత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.తన పెంపుడు కుక్క వింటర్‌తో కలిసి కనిపించిన సునీతను ఫొటోగ్రాఫర్లు పలకరించారు. ఈ సందర్భంగా మనుషుల కంటే జంతువులపై ప్రేమ చూపించడమే మంచిదన్న భావనను ఆమె వ్యక్తం చేశారు. మనుషులను ఎంతగా ప్రేమించినా చివరికి మోసం చేస్తారని, పెంపుడు జంతువులు మాత్రం ఎప్పుడూ తమ యజమానులకు తోడుగా ఉంటాయని ఆమె చెప్పినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆమె తన వ్యాఖ్యల్లో గోవిందా లేదా కోమల్ రాణి పేర్లను నేరుగా ప్రస్తావించలేదు.గోవిందా, కోమల్ రాణి కలిసి గణేశుడిని దర్శించుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వారి సంబంధంపై మరోసారి చర్చ మొదలైంది. ముఖ్యంగా కోమల్ రాణి నుదుటిపై, జుట్టు మధ్యలో సింధూరం కనిపించడంతో నెటిజన్లు పలు రకాలుగా స్పందించారు. అయితే అక్కడి పూజ సమయంలో గణేశుడి పాదాల వద్ద ఉన్న కుంకుమ ఆమె తలపై పడినట్లు మరో వీడియోలో కనిపించిందని కొన్ని మీడియా సంస్థలు వివరించాయి.

గోవిందా, కోమల్ రాణి మధ్య సంబంధంపై గతంలోనూ పలు ఊహాగానాలు వచ్చాయి. గోవిందా తన కొత్త చిత్రం 'రూపా'లో కోమల్ రాణిని సహనటిగా పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఇద్దరూ కలిసి బహిరంగంగా కనిపించిన సందర్భాలు ఈ చర్చలకు మరింత ఊతమిచ్చాయి. అయితే వారిద్దరూ తమ మధ్య ప్రేమ సంబంధం ఉందని అధికారికంగా ప్రకటించలేదు.ఇక సునీత గతంలోనూ గోవిందా, కోమల్ రాణి విషయంలో బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. మరోవైపు గోవిందా తరపు మేనేజర్ గతంలో రెండో వివాహం చేసుకునే ప్రశ్నే లేదని పేర్కొన్నట్లు నివేదికలు వచ్చాయి. గోవిందాసునీత దాంపత్య జీవితంపై వస్తున్న వివిధ ప్రచారాల నేపథ్యంలో ఈ వ్యవహారం మరోసారి బాలీవుడ్‌లో చర్చకు దారితీసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com